**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 320 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 12 ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## రాహుల్! అమ్మ ఆరోగ్యం ఎలా ఉంది?

**కాంగ్రెస్ అగ్రనేతతో మోదీ మాటామంతీ**



దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ శనివారం కాసేపు రాజకీయాంశాలు కాకుండా పరస్పరం కుశలప్రశ్నలు వేసుకున్నారు. సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పులే 200వ జయంతిని పురస్కరించుకుని పార్లమెంటు సముదాయంలో జరిగిన కార్యక్రమానికి వీరు హాజరయ్యారు. తనకంటే ముందు కార్యక్రమ వేదిక వద్దకు వచ్చిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు- జె.పి.నడ్డా, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తదితరులకు ముకుళిత హస్తాలతో అభివాదం చేస్తూ ముందుకు వెళ్లబోతున్న మోదీ.. అక్కడ రాహుల్‌ను చూసి ఆగారు. ఇటీవల ఆసుపత్రిలో చేరి చికిత్స పొందిన

- మిగతా2లో



## కార్యకర్తల్ని ఆర్థికంగా బలోపేతం చేస్తాం

- ఈ-3తో వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం
- ఇందుకోసం కొత్తగా ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్' విధానం తెస్తాం
- జీవనోపాధికి కాదు.. ప్రజాసేవకే రాజకీయాలు
- పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జులతో సీఎం చంద్రబాబు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల రాయితీలు ఇప్పించి.. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ-3 (ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్)అనే కొత్త విధానాన్ని తీసుకొస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. తద్వారా వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామన్నారు. నీతి, నిజాయతీలతోనే విలువలతో కూడిన రాజకీయాలు చేయగలమని చెప్పారు. రాజకీయాల్ని జీవనోపాధిగా ఎంచుకోకూడదని... ప్రజలకు సేవ చేయడానికే ఇందులోకి రావాలని స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న క్లస్టర్ ఇన్‌ఛార్జుల శిక్షణలో భాగంగా.. శనివారం నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు తదితర అంశాలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పార్టీ ఆవిర్భావానికి ముందు తర్వాతి పరిస్థితులు, తెదేపా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికల్ని వారికి వివరించారు. వైకాపా వాళ్ల దుర్మార్గాలు, తాజా రాజకీయ పరిస్థితులు సామాన్య కార్యకర్తలకు సైతం అర్థం చేయించగలిగేలా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందుల్నీ ప్రజలకు తెలియజేయండి క్షేత్రస్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం పడుతున్న ఆర్థిక ఇబ్బందుల్నీ ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని చంద్రబాబు సూచించారు. "రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని

- మిగతా2లో

## అమరావతి నిర్మాణ వ్యయంపై జగన్‌ది విష ప్రచారం

- పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయనకు కడుపుమంట
- పార్లమెంటు, తెలంగాణ సచివాలయం భవనాల ఖర్చును తక్కువ చేసిచూపిస్తున్నారు
- వాటికంటే 'అమరావతి' ఖర్చు ఎక్కువని అబద్ధాలు: మంత్రి నారాయణ



అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడంతో దాన్ని కదిలించలేమన్న కడుపుమంటతో, రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుంటే చూసి ఓర్వలేక వైకాపా అధ్యక్షుడు జగన్,

- మిగతా2లో

## యనమల రామకృష్ణుడికి సీఎం చంద్రబాబు ఫోన్

- ఇటీవల యనమల రామకృష్ణుడికి అస్వస్థత
- గుండెకు స్టెంట్ వేసిన వైద్యులు
- ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న యనమల
- ఫోన్ చేసి పరామర్శించిన సీఎం చంద్రబాబు
- త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్ష



- మిగతా2లో



## ప్రముఖ గాయని ఆశా భోంస్లేకి అస్వస్థత

**ఆసుపత్రిలో చేర్చిన కుటుంబ సభ్యులు**

ముంబయి: ప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే (92) శనివారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ సోకడంతో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడగా ముంబయిలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేర్చినట్లు ఆమె మనమరాలు జనాయీ భోంస్లే వెల్లడించారు.

- మిగతా2లో

## ఏపీలో భగ్గుమంటున్న ఎండలు: 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

- ఏపీలో రికార్డు స్థాయికి చేరిన ఉష్ణోగ్రతలు
- కడప జిల్లా పోట్టిపాడులో 44.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- ఆదివారం పలు జిల్లాల్లో తీవ్రమైన ఎండలు, వడగాలుల హెచ్చరిక
- శనివారం 200 మండలాల్లో 40 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రత

- మిగతా2లో



## ప్రేమ జంటల పాలిట కీచకుడు... పల్నాడు జిల్లాలో ఏఎస్సైపై సస్పెన్షన్ వేటు



- మాచర్ల ఏఎస్సై శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు
- ప్రేమ జంటలను వీడియోలు తీసి, బెదిరించి డబ్బు వసూలు
- మహిళలు, యువతులను వేధించినట్లు ఆరోపణలు
- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్
- విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో చర్యలు

పల్నాడు జిల్లా మాచర్లలో ఓ ఏఎస్సైపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రేమ జంటలను బెదిరించి డబ్బు వసూలు చేయడంతో పాటు, మహిళలను వేధించారన్న ఆరోపణలు నిరూపితం కావడంతో ఏఎస్సై శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ పోలీసు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి

- మిగతా2లో

## నేరుగా.. జోరుగా

- 1979 తర్వాత అమెరికా, ఇరాన్ ప్రత్యక్ష చర్చలు తొలిసారి షురూ
- ఇస్లామాబాద్‌లో జేడీ వాన్స్, ఘాలిబఫ్ బృందాల భేటీ
- పాల్గొన్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్
- విదేశాల్లోని ఇరాన్ ఆస్తుల విడుదలకు అమెరికా అంగీకారం?
- మరో రోజుకు పొడిగించాలని సూచించిన పాకిస్థాన్
- హర్మూజ్‌ను క్లియర్ చేస్తున్నామన్న ట్రంప్

- మిగతా2లో



## కడప జిల్లాలో కలకలం... ప్రేమోన్మాదిపై పోలీసుల కాల్పులు

- ఖాజీపేట విద్యార్థిని హత్య కేసు నిందితుడిపై కాల్పులు
- పోలీసుల నుంచి తప్పించుకునేందుకు యత్నించిన వెంకటేశ్
- నిందితుడి దాడిలో ఇద్దరు పోలీసులకు గాయాలు
- మోకాలి కింద కాల్పులు జరిపిన సీఐ వంశీధర్
- ఘటనపై సీఎం చంద్రబాబు ఆగ్రహం, కఠిన చర్యలకు ఆదేశం

కడప జిల్లా ఖాజీపేటలో తనను ప్రేమించలేదన్న కక్షతో రామకీర్తన అనే విద్యార్థినిని హత్య చేసిన నిందితుడు వెంకటేశ్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించి, పోలీసులపైనే దాడి చేయడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, రామకీర్తన హత్య కేసులో అరెస్టయిన వెంకటేశ్‌ను పోలీసులు మైదుకూరు నుంచి తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో బాసాపురం చెక్‌పోస్ట్ సమీపంలో అతను పోలీసుల

- మిగతా2లో



## ప్రపంచ ఉగ్రవాద సూచీలో ప్రథమస్థానం పాకిస్థాన్‌దే!

- గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2026లో పాకిస్థాన్‌కు అగ్రస్థానం
- గత ఏడాది ఉగ్రవాద దాడుల్లో 1,139 మంది మృతి
- వరుసగా ఆరో ఏడాదీ పాక్‌లో పెరిగిన ఉగ్రవాద హింస
- ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్‌లోనే అత్యధిక దాడులు
- ప్రభుత్వ వ్యూహాత్మక లోపాలే కారణమని నిపుణుల విశ్లేషణ

ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద మరణాలు, దాడుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతున్నప్పటికీ, పాకిస్థాన్‌లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

- మిగతా2లో



# అమరావతి నిర్మాణ వ్యయంపై జగన్‌ది విష ప్రచారం

-మొదటిపేజీ తరువాయి
ఆ పార్టీ నాయకులు రోజుకో విధంగా అవాకులు, చవాకులు పేలుతున్నారని, అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ ధ్వజమెత్తారు. దేశంలోని మిగతా ప్రాంతాల్లో చేసిన నిర్మాణాలతో పోలిస్తే, అమరావతిలో నిర్మాణ వ్యయం చాలా ఎక్కువంటూ దుష్ప్రచారం చేస్తూ, ప్రజల్ని తప్పుదారి పట్టించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014-19 మధ్య రాజధాని నిర్మాణానికి రూ.48 వేల కోట్లతో టెండర్లు పిలిచామని, వైకాపా ప్రభుత్వం పనులు కొనసాగించి ఉంటే ప్రజాధనం ఆదా అయ్యేదని నారాయణ తెలిపారు. అప్పటికీ ఇప్పటికీ జీఎస్టీ 12 శాతం నుంచి 18 శాతానికి పెరిగిందని, తారు, మెటల్, ఉక్కు వంటి నిర్మాణ సామగ్రి ధరలన్నీ పెరిగాయని ఆయన వివరించారు. ఆయన వెల్లడించిన వివరాలు ఇవీ!

పార్లమెంటు భవనానికి చదరపు అడుగుకు రూ.16,916 ఖర్చు: 6,94,000 చదరపు అడుగుల నిర్మాణానికి రూ.862 కోట్లతో మొదట టెండర్లు పిలిచారు. పని పూర్తయ్యేసరికి అన్ని రకాల ఖర్చులూ కలిపి రూ.1,174 కోట్లయింది. చదరపు అడుగుకి 16,916 ఖర్చు పెట్టారు.

తెలంగాణ సచివాలయం: రూ.615 కోట్లతో 7 లక్షల చదరపు అడుగుల నిర్మాణానికి మొదట టెండర్లు పిలిచారు. ఆ తర్వాత విస్తీర్ణం 10,34,000 చదరపు అడుగులకు, ఖర్చు రూ.1,423 కోట్లకు పెరిగింది. చదరపు అడుగుకు రూ.13,763 ఖర్చయింది.

అమరావతిలో ఐకానిక్ టవర్స్: చదరపు అడుగుకు రూ.15 వేల నుంచి రూ.16 వేలు వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం స్ట్రక్చర్‌కి మాత్రమే టెండర్లు పిలిచాం. ఎంఈపీ, ఇతర పనులకు త్వరలో టెండర్లు పిలుస్తాం

**రాజధాని రోడ్లని... జాతీయ రహదారులతో ఎలా పోలుస్తారు?**

కొందరు వైకాపా నాయకులు రాజధానిలో రహదారుల నిర్మాణం కంటే జాతీయ రహదారులకే చాలా తక్కువ ఖర్చు అవుతోందని విషం కక్కుతున్నారని, ఆ రెండింటినీ పోల్చడానికి వారికి అసలు ఇంగితం ఉందా? అని నారాయణ మండిపడ్డారు. జాతీయ రహదారుల్లో కేవలం రోడ్లు మాత్రమే వేస్తారన్నారు. "అమరావతి అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న నగరం. అక్కడ మురుగునీరు, వర్షపు నీరు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, టెలిఫోన్, గ్యాస్ లైన్‌లు వంటివన్నీ రహదారుల వెంబడి నిర్మించిన డక్ట్‌లలో భూగర్భంలోనే వేస్తున్నాం. వాటికి అటూ ఇటూ చెట్లు పెంచుతున్నాం. లైట్‌లు పెడుతున్నాం" అని తెలిపారు.

**అర్హత ఉన్న సంస్థలకే పనులు దక్కాయి..!**

రాజధాని నిర్మాణ పనులు ఒక వర్గానికి, కొందరు గుత్తేదారులకు మాత్రమే ఇచ్చారంటూ వైకాపా మరో దుష్ప్రచారం చేస్తోందని నారాయణ మండిపడ్డారు. "కావలసినవారికి ఇచ్చుకోవడానికి రాజధాని పనులు నామినేషన్‌పై ఇవ్వలేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పనులు చేసిన అర్హత ఉన్న సంస్థలే టెండర్లలో పాల్గొనేలా నిబంధనలు పెట్టి మరీ పనులు అప్పగించాం. షాపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ వంటి సంస్థలకు ఇతర దేశాల్లోనూ పనులు చేసిన అనుభవం ఉంది" అని వివరించారు.

రాజధానిలో ఎమ్మెల్యే క్వార్టర్లను ఈ నెల 20 నాటికి, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారులు అపార్ట్‌మెంట్ టవర్లను ఈ నెలాఖరుకి సాధారణ పరిపాలన శాఖకు అప్పగిస్తామని నారాయణ తెలిపారు. మంత్రులు, సీనియర్ అధికారుల బంగ్లాలు వచ్చే నెల 15కి యాభై శాతం, వచ్చే నెలాఖరుకి మిగతావి పూర్తవుతాయని తెలిపారు. మిగతా అపార్ట్‌మెంట్ టవర్లనీ వచ్చే రెండు నెలల్లో దశలవారీగా జీఏడీకి అప్పగిస్తామన్నారు.

**98 శాతం రైతులకు స్థలాలు కేటాయించేశాం**

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ఇప్పటి వరకు స్థలాలు కేటాయించలేదన్నది వైకాపా చేస్తున్న మరో విష ప్రచారమని నారాయణ ఆరోపించారు. "ఇప్పటి వరకు 31,158 మంది రైతులు భూసమీకరణలో 34,983 ఎకరాలు ఇచ్చారు. వారిలో 30,070 మంది రైతులకు 34,494 ఎకరాలకు సంబంధించి స్థలాలు కేటాయించేశాం" అని వివరించారు.

**5 వేల ఎకరాలు అమ్మితే 'రాజధాని' ఖర్చంతా వచ్చేస్తుంది**

"రాజధానిలో అన్ని అవసరాలకూ పోగా సీఆర్డీఏ దగ్గర 5 వేల ఎకరాల అభివృద్ధి చేసిన భూమి ఉంటుంది. 2014-19లో రాజధానిలో వ్యవసాయ భూమి ఎకరం రూ.7 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉంది. ప్రస్తుతం మౌలిక వసతులు కల్పించని భూమి ధరే ఎకరం రూ.4 కోట్లు నుంచి రూ.7 కోట్లు పలుకుతోంది. మౌలిక వసతులన్నీ కల్పించాక.. నాలుగైదేళ్ల తర్వాత 5 వేల ఎకరాలు విక్రయిస్తే ఎకరానికి రూ.20 కోట్లు చొప్పున రూ.లక్ష కోట్లు వస్తుంది. రాజధాని నిర్మాణానికి చేస్తున్న ఖర్చు కంటే ఎక్కువే వస్తుంది" అని మంత్రి తెలిపారు.

**ప్రాజెక్టుల వారీగా భూసమీకరణ చేస్తాం**

రాజధాని రెండో దశలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసం ప్రాజెక్టుల వారీగా భూసమీకరణలో భూములు తీసుకుంటామని, 16,660 ఎకరాలకు సంబంధించి భూసమీకరణ ప్రక్రియ జరుగుతోందని నారాయణ తెలిపారు. పెదపరిమిలో ఒక్క రోజే వెయ్యి ఎకరాలు ఇచ్చేందుకు రైతులు ముందుకొచ్చారని వెల్లడించారు.

# నేరుగా.. జోరుగా

ఇస్లామాబాద్: యుద్ధం ముగింపునకు అమెరికా, ఇరాన్ మధ్య చరిత్రాత్మక సమావేశం శనివారం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగింది. ముందుగా అనుకున్నట్లుగా పరోక్షంగా కాకుండా ఇరు దేశాల ప్రతినిధులు ప్రత్యక్షంగా భేటీ కావడం విశేషం. ఈ చర్చల్లో అమెరికా బృందానికి ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ బృందానికి ఆ దేశ పార్లమెంటు స్పీకర్ ఘాలిబఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ నాయకత్వం వహించారు. చర్చల్లో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పాల్గొన్నారు. చర్చల సందర్భంగా కీలక అంశాలకు సంబంధించిన తమ తమ డిమాండ్లను రెండు దేశాలు పరస్పరం పంచుకున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా అంగీకరించినట్లు సమాచారం. చర్చలను మరో రోజు పొడిగించాలని ఈ సందర్భంగా పాకిస్థాన్ సూచించింది. దీనిపై రెండు దేశాలు స్పందించాల్సి ఉంది. చర్చల అనంతరం రెండు దేశాల ప్రతినిధులు విందులో పాల్గొన్నారు. 'రెండు దేశాల ప్రతినిధులతో ప్రధాని షరీఫ్ విడివిడిగా సమావేశమైన తర్వాత నేరుగా చర్చలు ప్రారంభమయ్యాయి. అమెరికా, ఇరాన్ బృందాలు ఒకే టేబుల్‌పై కూర్చున్నాయి. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమయ్యాక నేరుగా చర్చలు జరగడం ఇదే తొలిసారి' అని పాక్ ప్రధాని కార్యాలయ అధికారి ఒకరు వెల్లడించారు.

**షరీఫ్‌తో భేటీలు**

ఇస్లామాబాద్ చేరుకున్న అమెరికా, ఇరాన్ ప్రతినిధి బృందాలు తొలుత పాక్ ప్రధాని షెహబాజ్, ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌తో భేటీ అయ్యాయి. ఇరాన్ బృందంలో ఘాలిబఫ్, అరాగ్చీ తదితరులున్నారు. వాన్స్ బృందమూ షరీఫ్‌తో సమావేశమైంది. ఈ బృందంలో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ ఉన్నారు. నిర్మాణాత్మక చర్చలు జరపడానికి రెండు దేశాల బృందాలు సిద్ధంగా ఉన్నాయని, ఇవి ఈ ప్రాంతంలో శాశ్వత శాంతికి సహకరించనున్నాయని షరీఫ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

**ఘన స్వాగతం**

చర్చల్లో పాల్గొనేందుకు ఇస్లామాబాద్ చేరుకున్న రెండు దేశాల ప్రతినిధి బృందాలకు ఉప ప్రధాని ఇషాక్ దార్, ఆసిం మునీర్ ఘన స్వాగతం పలికారు. చర్చల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. 10,000 మంది పోలీసు, భద్రతా సిబ్బందిని మోహరించారు. చర్చలు జరిగిన ప్రధాన భవనానికి సైన్యం, రేంజర్స్ పహారా కాశాయి.

**'అమెరికా ఫస్ట్' అయితే డీల్‌కు సిద్ధం**

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నినాదమైన 'అమెరికా ఫస్ట్'కు ఆ దేశం కట్టుబడి ఉంటే అమెరికాతో ఒప్పందానికి సిద్ధమని ఇరాన్ ఉపాధ్యక్షుడు రెజా ఆరిఫ్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ ఫస్ట్ అంటే మాత్రం ఒప్పందానికి అంగీకరించబోమని పేర్కొన్నారు. చర్చలు విఫలమైతే ప్రపంచం భారీగా నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**హర్మూజ్‌ను క్లియర్ చేస్తున్నాం: ట్రంప్**

ఒకవైపు ఇక్కడ చర్చలు జరుగుతుంటే...ఇరాన్‌పైనా, హర్మూజ్‌పైనా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ల వర్షం కురిపించారు. 'ఇరాన్ ఓ విఫలదేశం... హర్మూజ్ జల సంధిని క్లియర్ చేస్తున్నాం. ఇరాన్ నౌకాదళం పోయింది.. వైమానిక దళం పోయింది. హర్మూజ్ జల సంధిలో ఏర్పాటు చేసిన సీమైన్స్‌ను తొలగిస్తున్నాం' అని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ భారీగా నష్టపోతోందని వ్యాఖ్యానించారు. యుద్ధంలో ఇరాన్‌ది పైచేయి అయ్యిందన్న వార్తలను ఫేక్‌న్యూస్‌గా అభివర్ణించారు. మీడియా విశ్వసనీయత కోల్పోయిందని విమర్శించారు.

**లెబనాన్‌పై కొనసాగిన దాడులు**

ఒకవైపు చర్చలు జరుగుతుండగా.. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగించింది. శనివారం నాటి దాడుల్లో ముగ్గురు మరణించారు. 24 గంటల్లో 200 హెజ్‌బొల్లా లక్ష్యాలను ఛేదించామని ఇజ్రాయెల్ వెల్లడించింది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని సైనిక కేంద్రాలపై రాకెట్లను ప్రయోగించామని హెజ్‌బొల్లా పేర్కొంది.

వాషింగ్టన్‌లోని లెబనాన్ రాయబారి.. ఇజ్రాయెల్ రాయబారితో ఫోన్‌లో మాట్లాడారు. వచ్చేవారం రెండు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ ఫోన్ సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది.

**ప్రధాని పర్యటన వాయిదా**

ఇజ్రాయెల్‌తో చర్చలు జరిపేందుకు వాషింగ్టన్‌కు వెళ్లాల్సిన లెబనాన్ ప్రధాని నవాఫ్ సలాం తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఇజ్రాయెల్‌తో చర్చలను వ్యతిరేకిస్తూ వేల మంది లెబనాన్‌లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బీరుట్‌లో సలాం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పర్యటన వాయిదా పడింది. అంతకుముందు ఇజ్రాయెల్‌తో చర్చలకు లెబనాన్ అంగీకరించడాన్ని ఇరాన్ తప్పుబట్టింది. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య వచ్చే మంగళవారం అమెరికా విదేశాంగశాఖ ఆధ్వర్యంలో చర్చలు జరగాల్సి ఉంది.

**దాడులు కొనసాగుతున్నాయ్: ఖతార్**

చర్చలు జరుగుతున్నా... ఇరాన్ తమ దేశంపై, పౌర నివాసాలపై దాడులు చేస్తోందని ఖతార్ ఆరోపించింది. తమ దేశంపై దాడులు చేయకుండా ఉండటానికి డబ్బులు చెల్లిస్తున్నామని వచ్చిన ఆరోపణలను ఖండించింది.

**సౌదీకి పాక్ సైన్యం**

రక్షణ ఒప్పందంలో భాగంగా.. సౌదీ అరేబియాకు పాకిస్థాన్ తన సైన్యాన్ని పంపింది. 13,000 మంది సైనికులు సౌదీ చేరుకున్నారు. 10 నుంచి 18 ఫైటర్ జెట్లూ వెళ్లాయి. కింగ్ అబ్దుల్లా వైమానిక స్థావరం కేంద్రంగా పాక్ సైన్యం పని చేయనుంది.

**ఇరాన్‌కు చైనా రక్షణ వ్యవస్థ!**

ఇరాన్‌కు కొత్త గగనతల రక్షణ వ్యవస్థలను అందించడానికి చైనా ఏర్పాట్లు చేస్తోందని అమెరికా నిఘా వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ వార్తలను అమెరికాలోని చైనా ఎంబసీ ఖండించింది.

**ఇరాన్ డిమాండ్లు..**

1. హర్మూజ్ జల సంధి పూర్తిగా మా నియంత్రణలోనే ఉండాలి.
2. యుద్ధ నష్టపరిహారం చెల్లించాలి.
3. గతంలో స్తంభింపజేసిన విదేశాల్లోని ఆస్తులను విడుదల చేయాలి.
4. ఇరాన్‌కు సంబంధించిన అన్ని ప్రాంతాల్లో కాల్పుల విరమణను అమలు చేయాలి.

# ప్రపంచ ఉగ్రవాద సూచీలో ప్రథమస్థానం పాకిస్థాన్‌దే!

-మొదటిపేజీ తరువాయి
గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2026లో పాకిస్థాన్ అగ్రస్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది అక్కడ ఉగ్రవాద సంబంధిత ఘటనల్లో ఏకంగా 1,139 మంది ప్రాణాలు కోల్పోయినట్లు శనివారం విడుదలైన ఒక నివేదిక వెల్లడించింది. మొరాకోకు చెందిన జర్నలిస్ట్, పరిశోధకురాలు ఫాతిమా ఎల్ హాషిమి 'అమెరికన్ థింకర్' అనే ఆన్‌లైన్ మ్యాగజైన్‌లో ఈ విషయంపై విశ్లేషించారు. పాకిస్థాన్‌లో హింస ఒక సాధారణ విషయంగా మారిపోయిందని, ఇది దేశ భద్రతా వ్యవస్థ తీవ్రంగా క్షీణిస్తోందనడానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. పాక్‌లో ఉగ్రవాదం పెరగడం ఇది వరుసగా ఆరో ఏడాది అని ఆమె గుర్తుచేశారు. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా మరణాల సంఖ్య పెరిగిందని తెలిపారు.

2025లో జరిగిన దాడుల్లో 74 శాతానికి పైగా, మరణాల్లో 67 శాతం ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలోనే నమోదయ్యాయని ఫాతిమా వివరించారు. ఈ ప్రాంతాల్లో పాలన, అభివృద్ధి లేకపోవడం వల్లే అంతర్గత సంఘర్షణలకు కేంద్రంగా మారాయని ఆమె అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్ ఉగ్రవాద నిరోధక వ్యూహం కేవలం సైనిక చర్యలకే పరిమితమైందని, పాలనాపరమైన సంస్కరణలు, తీవ్రవాదాన్ని నిరోధించే ఇతర చర్యలు బలహీనంగా ఉన్నాయని ఫాతిమా విమర్శించారు. కేవలం సైనిక బలంతో కాకుండా రాజకీయ స్పష్టత, సమర్థవంతమైన పాలన, పొరుగు దేశాలతో (ముఖ్యంగా ఆఫ్ఘనిస్థాన్‌తో) సత్సంబంధాలు వంటి చర్యలు చేపడితేనే పాకిస్థాన్‌లో శాంతి నెలకొంటుందని ఆమె స్పష్టం చేశారు.

## ప్రేమ జంటల పాలిట కీచకుడు... పల్నాడు జిల్లాలో ఏఎస్పైపై సస్పెన్షన్ వేటు

-మొదటిపేజీ తరువాయి
వెళితే, మాచర్ల నియోజకవర్గంలోని పర్యాటక ప్రాంతాలకు వచ్చే ప్రేమికులు, కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా శ్రీనివాస్ వ్యవహరించినట్లు తేలింది. వారి ఏకాంతాన్ని వీడియోలు తీయించి, బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడని విచారణలో వెల్లడైంది. అంతేకాకుండా, యువతులను బెదిరించి తన కోరికలు తీర్చాలంటూ ఒత్తిడి చేసి వేధింపులకు పాల్పడేవాడని కూడా తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన అకృత్యాలకు సంబంధించిన కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో పోలీసు శాఖ వెంటనే స్పందించి విచారణ చేపట్టింది. విచారణలో ఆరోపణలన్నీ నిజమని తేలడంతో ఏఎస్పై శ్రీనివాస్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు.

## యనమల రామకృష్ణుడికి సీఎం చంద్రబాబు ఫోన్

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం నాడు ఫోన్ ద్వారా పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం అస్వస్థతకు గురైన యనమల ఆరోగ్య పరిస్థితిని ఆయన ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుతున్న చికిత్స వివరాలను, ఆయన క్షేమ సమాచారాలను చంద్రబాబు ఆరా తీశారు. ఈ సందర్భంగా, పార్టీకి సీనియర్ నేతగా యనమల సేవలు ఎంతో కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, మళ్లీ ప్రజా క్షేత్రంలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఇటీవల అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వైద్యులు ఆయన గుండెకు స్టెంట్ వేశారు. ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు ఆయన తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. యనమల త్వరగా కోలుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆకాంక్షిస్తున్నారు.

## రాహుల్! అమ్మ ఆరోగ్యం ఎలా ఉంది?

-మొదటిపేజీ తరువాయి
సోనియా గాంధీ ఇప్పుడు ఆరోగ్యంగానే ఉన్నారా అని ప్రశ్నించారు. మెరుగుపడుతోందని రాహుల్ బదులిచ్చారు. మోదీ సంతృప్తి వ్యక్తపరిచి తన శుభాకాంక్షలు చెప్పాలని కోరారు. ప్రధాని ఏదో మాట్లాడుతుండగా రాహుల్ తలూపుతూ బదులిచ్చారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

## ఏపీలో భగ్గుమంటున్న ఎండలు: 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. శనివారం కడప జిల్లాలో గరిష్టంగా 44.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ నేపథ్యంలో, ఆదివారం కూడా పలు జిల్లాల్లో తీవ్రమైన ఎండలతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరికలు జారీ చేసింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 200కు పైగా మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లా కొండాపురం మండలం పొట్టిపాడులో అత్యధికంగా 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 44.3 డిగ్రీలుగా రికార్డయింది. రాయలసీమ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఆదివారం పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు రాయలసీమలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాలులు వీస్తాయని, మొత్తం 93 మండలాల్లో వీటి ప్రభావం ఉంటుందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. శుక్రవారం కూడా కాకినాడ జిల్లా కరపలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వారాంతంలో ఎండల తీవ్రత గరిష్ట స్థాయికి చేరుకుంటుందని అధికారులు ముందే హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని సూచించారు.

## కార్యకర్తల్ని ఆర్థికంగా బలోపేతం చేస్తాం

-మొదటిపేజీ తరువాయి
ప్రోత్సహించడంతో పాటు క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్‌గా తెదేపాను నిలపాల్సిన బాధ్యత కార్యకర్తలదే. రాబోయే ఏ ఎన్నికైనా తెదేపా ఓటుబ్యాంకు పెరగాలి" అని చంద్రబాబు అన్నారు. సోలార్ రూఫ్‌టాప్‌ల వల్ల బిల్లుల భారం తగ్గింది: సోలార్ రూఫ్‌టాప్‌ల వినియోగంతో విద్యుత్తు బిల్లుల భారం తగ్గిందని పలువురు కార్యకర్తలు చంద్రబాబు దృష్టికి తెచ్చారు. "ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేస్తున్నాం. బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.20 వేల వరకూ రాయితీ ఇస్తున్నాం. పీఎం కుసుమ్ ద్వారా రాయితీ వస్తుంది. ఉత్పత్తైన సౌర విద్యుత్తును వినియోగించుకోగా మిలిగిన దాన్ని గ్రిడ్‌కు విక్రయించవచ్చు.. తద్వారా ఆదాయం వస్తుంది. వైకాపా ప్రభుత్వం 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపింది. మనం ఛార్జీల భారాన్ని తగ్గించాం. ఇంకా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని చంద్రబాబు తెలిపారు. మే 15న పంటలకు నీళ్లు ఇస్తామని చెప్పారు. జిల్లాల్లో యోగా గురువుల్ని నియమించి శిక్షణ ఇప్పిస్తామన్నారు. అనంతరం వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తెదేపా మానవవనరుల విభాగం ఛైర్మన్ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు.

## కడప జిల్లాలో కలకలం... ప్రేమోన్మాదిపై పోలీసుల కాల్పులు

-మొదటిపేజీ తరువాయి
నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అడ్డుకోబోయిన పోలీసులపై ఎదురుదాడికి దిగాడు. ఈ దాడిలో ఇద్దరు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనపై కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ స్పందిస్తూ, "లొంగిపొమ్మని హెచ్చరించి, సీఐ గాల్లోకి కాల్పులు జరిపినా నిందితుడు వినలేదు. దీంతో ఆత్మరక్షణ కోసం సీఐ వంశీధర్ అతని మోకాలి కింది భాగంలో కాల్పులు జరపాల్సి వచ్చింది" అని వివరించారు. ప్రేమను నిరాకరించిందనే కోపంతోనే వెంకటేశ్, రామకీర్తన గొంతు కోసి హత్య చేశాడని ఎస్పీ తెలిపారు. ఈ హత్య ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం గాయపడిన వెంకటేశ్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# గన్నవరంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు.





- నివాళులర్పించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.
- సమానత్వం, విద్యా, బడుగు వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే కృషి.
- పూలే స్ఫూర్తి తోనే బీసీలకు రాజకీయ గుర్తింపు తెచ్చిన నాయకుడు ఎన్టీఆర్.
- బీసీల సంక్షేమం, అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంటుంది.

**గన్నవరం, పెన్ సత్తా, ఏప్రిల్ 11:**సమాజంలో సమానత్వం, విద్యా, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొనియాడారు. శనివారం గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు శతాబ్దాల క్రితమే పూలే సమానత్వం, విద్య కోసం పోరాడారని, ఆయన ఆశయాలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని అన్నారు. పూలే చూపిన దారిలోనే సాగుతూ, స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తర్వాతే రాష్ట్రంలో బీసీలకు నిజమైన రాజ్యాధికారం లభించిందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ రాజకీయ రంగప్రవేశానికి ముందు వరకు అధికార వ్యవస్థ కొద్ది వర్గాలకే పరిమిత మై ఉండేదని, మండల వ్యవస్థను ప్రవేశపెట్టి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని వివరించారు. అంతకు ముందు ఉన్న రాజరిక, వంశపారంపర్య రాజకీయాలకు ముగింపు పలికి, సాధారణ ప్రజలు కూడా మంత్రుల స్థాయికి ఎదగగలిగే పరిస్థితులు ఏర్పరిచిన నాయకుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తి తోనే బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, కూటమి నాయకులు కొండేటి వెంకటేశ్వర రావు, మోదుగుమూడి సత్యనారాయణ, జొన్నలగడ్డ సుధాకర్, కంభంపాటి లక్ష్మి నరసమ్మ, బోడపాటి రవి, మల్లారెడ్డి కిషోర్, జాస్తి శ్రీధర్, తుల్లిమిల్లి ఝాన్సీ, పాలడుగు వెంకట వరప్రసాద్, జాస్తి మురళి, కానూరు శేషు మాధవి, చిమట రవి వర్మ , అన్నే హరి కృష్ణ , మండాది రవీంద్ర, బుస్సే నాగ ప్రసాద్, కొసరాజు సాయిరాం, వలివేటి కిషోర్, మద్దినేని వెంకటేశ్వరరావు, తిరువీధి నరేష్, బుస్సే సరిత, జాస్తి రేణుక , అన్నే ధనలక్ష్మి, కాగితాల నాగరాజు, మణిమాల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# దేశం లోని సంఘ సంస్కర్తల్లో అగ్ర గణ్యులు మహాత్మా జ్యోతిరావు పూలే.





- ఆయన మార్గంలో పయనించి సమాజాభివృద్ధికి కృషి చేయాలి.
- మహాత్మా జ్యోతిరావు పూలే భవన్ నిర్మాణం సాకారం చేసుకుందాం.
- పూలే ద్వి శతాబ్ది జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు.

**రావులపాలెం, పెన్ సత్తా, ఏప్రిల్ 11:**ఆధునిక భారతదేశం లోని సంఘసంస్కర్తల్లో అగ్రగణ్యులు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు కొనియాడారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మహాత్మా జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాల్లో సత్యానంద రావు, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలు నిర్వహించుకోవడం చాలా ఆనందంగా, సంతోషంగా ఉందన్నారు. మహాత్మా గాంధీ కంటే ముందే సమాజంలో సంస్కరణల కోసం, అంటరానితనం నివారణ కోసం, సామాజిక న్యాయం కోసం, రాజకీయ అధికారం కోసం, కుల, మత, లింగ మొదలైన సామాజిక వివక్షతల పై, రైతాంగ సమస్యల పై పోరాడిన యోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆయన అడుగు జాడల్లోనే అనేకమంది సంఘ సంస్కర్తలు ఈ సమాజ ఉద్ధరణకు ముందుకు వచ్చారన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే ఆనాడే బాలికల పాఠశాలను ప్రారంభించి తొలి ఉపాధ్యాయురాలిగా సమాజానికి సేవ చేశారన్నారు. సమాజంలో ఉన్న వివక్షత తొలగించి, విద్యా వ్యాప్తి కోసం ఆ మహనీయులు చేసిన పోరాటం అనన్య సామాన్యమన్నారు. నేడు ఈ సమాజం ఇంత ముందడుగు వేసిందంటే ఆ మహానుభావుల యొక్క ఆశయాలు, త్యాగాలు, కృషి కారణమన్నారు.

ఏప్రిల్ నెలలో 11 వ తేదీన మహాత్మా జ్యోతి రావు పూలే, 14 వ తేదీన బాబా సాహెబ్ అంబేద్కర్, 5 వ తేదీన బాబు జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల జయంతులు ఉండటం, మహనీయులు అంతా ఒక నెలలోనే జన్మించడం జరిగిందన్నారు. పూలే తన ఆరోగ్యం సహకరించకపోయినా, సంకల్పంతో, పట్టుదలతో రైతు సమస్యల పై గులాంగిరీ వంటి పుస్తకాలు రచించారని కొనియాడారు. మహిళలు విద్యావంతులు కావాలని, విజ్ఞానంతోటే సమాజం బాగుపడుతుందని, విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలకు సామాజిక చైతన్యాన్ని అందించి, విజ్ఞానాన్ని పంచినటువంటి గొప్ప మహనీయమైన వ్యక్తి జ్యోతి రావు పూలే అని ప్రశంసించారు. తొలిసారిగా డిఎస్ఎస్ స్వామి కాకినాడలో జ్యోతి రావు పూలే గొప్పదనం పై సదస్సు ఏర్పాటు చేస్తే అప్పుడు దివంగత బాలయోగి, తాను వెళ్లి ఆ సదస్సులో పాల్గొనడం ద్వారా ఆ మహనీయుని యొక్క గొప్పతనం తెలుసుకున్నామన్నారు. తదుపరి చిరంజీవి ప్రజారాజ్యం స్థాపించినప్పుడు జ్యోతిబా పూలే గురించి విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. తరువాత ప్రభుత్వాలే ఆ మహనీయుని యొక్క జయంతిని జరుపుతున్నాయని తెలిపారు. సమాజంలో సమానత్వం ఉండాలని, అట్టడుగు వర్గాలకు రాజకీయ అధికారం ఉండాలని, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన వ్యక్తి జ్యోతిబాపూలే అన్నారు. ఆయన ద్వి శతాబ్ది జయంతి ఇప్పుడు జరుపుకోవడం ద్వారా వారి అడుగుజాడల్లో మనం నడవాలని కోరుకుంటున్నానన్నారు. జ్యోతిబా పూలే అడుగుజాడల్లోనే ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించారని, అడుగు వర్గాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించారని కొనియాడారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం అదే బాటలో కొనసాగుతున్నారన్నారు. జ్యోతిబాపూలే అడుగుజాడల్లో ఎన్డీఏ కూటమి నాయకులు నడుస్తున్నారని, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మానవనరుల శాఖ మంత్రి నారా లోకేష్ లు పూలే ఆశయ సాధన కోసం, ప్రజల అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్నారన్నారు. రైతులు, మహిళలు, దళితులు, బలహీనవర్గాలు ముందడుగు వేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుపరిపాలన అందిస్తున్నాయని జ్యోతిరావు పూలే ఆదర్శాలను ముందుకు తీసుకెళుతున్నాయన్నారు. జ్యోతిరావు పూలే భవనం కోసం ఎన్నికల ముందు కొత్తపేట నియోజకవర్గ మేనిఫెస్టోలో చేర్చడం జరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సైతం తీసుకెళ్లామని, స్థల సేకరణ ప్రయత్నాలు జరుగుతున్నాయని, స్థలాన్ని సమీకరించుకుని, నిధులు తెచ్చుకుని భవనాన్ని నిర్మించుకుందామన్నారు. త్వరలోనే మహాత్మ జ్యోతిరావు పూలే భవన్ రావులపాలెంలో సాకారం అవుతుందన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి చింతమనేని







**దుగ్గిరాల, పెన్ సత్తా, ఏప్రిల్ 11:**ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి ప్రజలకు అండగా నిలవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాల లోని క్యాంపు కార్యాలయంలో పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, ప్రజలు దెందులూరు ఎమ్మెల్యే ప్రభాకర్ ని కలిసి పలు సమస్యల పై వినతిపత్రాలు, పలు ఆహ్వాన పత్రికలను అందించారు.

ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు





**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 11**: జిల్లా కశింకోట మండలం పెరంటలపాలెం గ్రామం లో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సామాజిక తత్వవేత్త నవయుగ వైతాళికుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ విచ్చేసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ 19 వ శతాబ్దపు భారతదేశం యొక్క అణచివేత సామాజిక నిర్మాణానికి సవాల్ చేయటానికి తన జీవితాన్ని అంకితం చేసిన సంఘసంస్కర్త, గొప్ప ఆలోచనపరుడన్నారు. ఆ రోజుల్లో భారతదేశ బాలికల కోసం ప్రత్యేకించి ఒక పాఠశాలను ప్రారంభించిన భారతదేశం లోని మొట్ట మొదటి వ్యక్తి, విద్య యొక్క విస్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త కూడా ఈయనే అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధారణకు కృషి చేశాడన్నారు. పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ జాతి వివక్ష లేని సమసమాజ స్థాపన కోసం జీవితం మొత్తాన్ని అంకితం చేసిన మహానుభావుడు జ్యోతిరావు పూలే అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొంతిని శ్రీనివాసరావు, జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణ మూర్తి, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, గొంతిన చిరంజీవి, కలిగట్ల సింహాద్రి, బుదిరెడ్డి గంగయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు శాఖకు అండగా 'అసిస్ట్' సంస్థ 3 బొలెరో వాహనాల పంపిణీ.

కృష్ణ హరీష్ ను సన్మానించిన ఎమ్మెల్యే బాలకృష్ణ.




**హిందూపురం, పెన్ సత్తా, ఏప్రిల్ 11:**సామాజిక బాధ్యతలో భాగంగా అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ పోలీసు శాఖకు అండగా నిలిచింది. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం లోని పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు, నిఘాను పటిష్టం చేసేందుకు ఆ సంస్థ మూడు నూతన బొలెరో వాహనాలను విరాళంగా అందజేసింది. సీఎస్సార్ నిధులతో ఈ వాహనాల కొనుగోలు.

హిందూపురం టౌన్-1, టౌన్-2, రూరల్ పోలీస్ స్టేషన్ల అవసరాల నిమిత్తం ఒక్కొక్కటి 11 లక్షల రూపాయల విలువైన మూడు బొలెరో వాహనాలను అసిస్ట్ సంస్థ తన సీఎస్సార్ నిధుల నుండి సమకూర్చింది. ఏప్రిల్ 6, 2026 న ఈ వాహనాలను పోలీసు శాఖకు అధికారికంగా అప్పగించారు.

కృష్ణ హరీష్ ను సన్మానించిన ఎమ్మెల్యే బాలకృష్ణ. నియోజకవర్గ అభివృద్ధికి, పోలీసు యంత్రాంగానికి సహకరిస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ జె. కృష్ణ హరీష్ ని స్థానిక శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఘనంగా సన్మానించారు. సంస్థ చేస్తున్న సామాజిక సేవలను బాలకృష్ణ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్పీ. సతీష్ కుమార్ పాల్గొని వాహనాలను ప్రారంభించారు. శాంతి భద్రతల పరి రక్షణలో దాతల సహకారం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే స్ఫూర్తితో కూటమి పాలన మంత్రి సవిత.









- బీసీల విద్యకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం.
- ఇంటర్ కళాశాలలుగా రాష్ట్రంలో 6 ఎంజేపీ బాలికల గురుకులాలు.
- రూ.500 కోట్లతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు.
- జగన్ అసమర్థ పాలనతో అత్యధికంగా నష్టపపోయిన బీసీలు.
- పూలే స్ఫూర్తితో టీడీపీ ఆవిర్భావం మంత్రి అచ్చెన్నాయుడు.
- త్వరలో బీసీ రక్షణ చట్టం అమలు మంత్రి కొల్లు రవీంద్ర.
- ప్రపంచ గర్వపడే బీసీ నేత ప్రధాని నరేంద్ర మోదీ.
- జగన్ హయాంలో బీసీ మంత్రులకు అవమానాలు మంత్రి సత్య కుమార్.
- ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకలు.
- పూలే విగ్రహానికి మంత్రులు ఘన నివాళులు.
- వివిధ రంగాలకు చెందిన 11 మందికి సత్కారం.

**విజయవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 11:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే తన జీవితాన్ని ధారపోశారని మంత్రులు ఎస్. సవిత, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్ అన్నారు. మహ్మాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, బీసీల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రూ.500 కోట్లతో ఎంజేపీ గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఆరు ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలను ఇంటర్మీడియట్ కళాశాలలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమరావతిలో మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతివనం ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు స్థల అన్వేషణ చేస్తున్నామని తెలిపారు. బీసీలకు సీఎం చంద్రబాబు అగ్రతాంబూలం వేస్తే, జగన్ ప్రభుత్వం బీసీలను వేధించి, అణగదొక్కిందని మండి పడ్డారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వంలో బీసీ మంత్రులు తీవ్ర అవమానాలకు గురయ్యేవారన్నారు. మరో మంత్రులు కింజరపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఎన్టీఆర్ రాకతోనే బీసీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ గుర్తింపు లభించిందన్నారు. విజయవాడ లోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శనివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి బా పూలే 200 వ జయంతి (ద్విశతాబ్ది) రాష్ట్ర స్థాయి వేడుకలు శనివారం ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగిస్తూ ఈ స్థాయిలో సేవ చేసే అవకాశం తనకు గర్వకారణమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో పూలే జయంతిని రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి, రిజర్వేషన్ల అమలుకు స్వర్గీయ నందమూరి తారకరామా రావు చేసిన కృషిని ఆమె స్మరించుకున్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా బీసీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త' అనే సంకల్పంతో బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళా సాధికారత, మహిళా విద్యకు పూలే దంపతులు నాంది పలికారని, వారి ఆశయాల వల్లే నేడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వంటి మహిళలు కీలక పదవుల్లో ఎదుగుతున్నారని పేర్కొన్నారు. బీసీ రక్షణ చట్టం, ప్రభుత్వ కట్టుబాటు బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం అవసరాన్ని నారా లోకేష్ ముందుకు తెచ్చారని, ప్రజా పాదయాత్రలో బీసీల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ వరాలు, బీసీల అభ్యున్నతికి కొత్త నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఈ జయంతి సందర్భంగా బీసీ సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఆరు బాలికల కళాశాలలకు ఇంటర్మీడియట్ అప్‌గ్రేడేషన్ అనుమతి గురుకుల పాఠశాలల శాశ్వత భవనాల నిర్మాణానికి 500 కోట్లు మంజూరు, మహాత్మా జ్యోతి బా పూలే స్మృతి వనం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశామని, కూటమి ప్రభుత్వాన్ని బీసీల ప్రభుత్వంగా అభివర్ణిస్తూ, బీసీలందరూ ఐక్యంగా ఉండి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు..జగన్ అసమర్థ పాలనతో నష్టపోయిన బీసీలు.

అయిదేళ్ల జగన్ పాలనలో బీసీలు తీవ్రంగా నష్టపోయారని మంత్రి సవిత మండి పడ్డారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాల పై ప్రశ్నించినందుకు తనతో పాటు మంత్రులు కింజరపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర సహా ఎందరో నేతల పై తప్పుడు కేసులు పెట్టి వేధించారన్నారు. సీఎం చంద్రబాబు రాకతో బీసీలకు మంచిరోజులు ప్రారంభమయ్యాయన్నారు. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. బీసీలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదాద్దలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు.

**పూలే స్ఫూర్తితో ఎన్టీఆర్ పాలన మంత్రి అచ్చెన్నాయుడు:** రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ ఽ ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వందల ఏళ్ల క్రితమే కుల వివక్షకు వ్యతిరేకంగా స్వరమెత్తి, విద్య యొక్క ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. 1982 లో స్వర్గీయ నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించిన తర్వాతే బీసీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో గౌరవ ప్రదమైన గుర్తింపు లభించిందని మంత్రి గుర్తు చేశారు. ఆ కాలం నుండి బీసీల అభివృద్ధికి పునాది పడిందన్నారు. రాష్ట్రంలో బీసీ వర్గాల విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, వందల సంఖ్యలో రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఈ విద్యా సంస్థలు బీసీ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన బాటలు వేస్తున్నాయని అన్నారు.

**అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవనాల నిర్మాణం.** గత ప్రభుత్వం బీసీ భవనాల నిర్మాణాన్ని నిలిపివేస్తే, కూటమి ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో బీసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా భవనాలను కూటమి ప్రభుత్వం నిర్మిస్తోందని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి నాయకత్వంలో బీసీల సమగ్ర అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో అందరూ ఐక్యంగా కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**బీసీలకు 'చట్టం'తో రక్షణ మంత్రి కొల్లు రవీంద్ర:** రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పండుగ వాతావరణంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి జరుపు కోవడం ఆనందంగా ఉందన్నారు. దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, ముఖ్యంగా విద్య, సామాజిక సమానత్వం కోసం పోరాడిన తొలి మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. కుల వివక్షను ధైర్యంగా ఎదిరిస్తూ, తన భార్య సావిత్రి బాయి పూలేను దేశం లోని తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన మహత్తర కృషిని ఈ సందర్భంగా మంత్రి స్మరించుకున్నారు. సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. 1982లో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి. రామారావు పార్టీ స్థాపన అనంతరం బీసీలకు రాజకీయంగా గుర్తింపు లభించిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలు ద్వారా అనేక మంది బీసీ నాయకులు ఎదిగే అవకాశం పొందారని అన్నారు. గత ప్రభుత్వం బీసీల సంక్షేమాన్ని విస్మరించడంతో పాటు, అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత బీసీల రక్షణ కోసం ప్రత్యేకంగా రక్షణ చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. బీసీలు కేవలం సబ్సిడీలకే పరిమితం కాకుండా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, దానికి అవసర మైన విధి విధానాలను ప్రభుత్వం రూపొందిస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

**జగన్ హయాంలో బీసీ మంత్రులకు అవమానం మంత్రి సత్యకుమార్ యాదవ్.** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశంలోని అన్ని భాషల పత్రికలలో మహాత్మా జ్యోతిబా పూలే గురించి వ్యాసాలు ప్రచురితమఅయ్యాయన్నారు. 200 ఏళ్ల క్రితం జన్మించినప్పటికీ, ఆయన సామాజిక సంస్కరణలు నేటికీ భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని కొనియాడారు. అనేక అడ్డంకులు, అవమానాల మధ్య కూడా బీసీల సాధికారత కోసం మహాత్మా జ్యోతి బా పూలే చేసిన కృషిని మంత్రి స్మరించుకున్నారు. ఆయన పోరాటం సమాజంలో సమానత్వానికి బాటలు వేసిందన్నారు. రాజకీయ ప్రాధాన్యత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ నుండి నేటి ముఖ్యమంత్రి వరకు రాష్ట్రం లో బీసీలకు రాజ్యాధికారం కల్పించాలనే లక్ష్యంతో కృషీ చేస్తున్నారన్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, మంత్రివర్గంలో ఎనిమిది మంది బీసీలకు ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా కేంద్రంలో 27 మంది బీసీ మంత్రులు ఉండటం గర్వకారణమన్నారు. ఒక సాధారణ బీసీ కుటుంబం నుంచి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ నేడు ప్రపంచ నాయకుడిగా ఎదగడం బీసీలందరికీ ప్రేరణగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు బీసీలకు బలమైన మద్దతు అన్నారు. 127 వ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రాలకు బీసీలను గుర్తించే అధికారాన్ని కల్పించడాన్ని మంత్రి స్వాగతించారు. ముద్రా యోజన, కిసాన్ యోజన, స్వనిధి వంటి పథకాల ద్వారా బీసీలకు విస్తృత ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో బీసీ సాధికారత కోసం 56,000 కోట్లను కేటాయించడం ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ పేరుతో మోసం చేసిందని, బీసీ నాయకులను వేధించిందని మంత్రి విమర్శించారు. జగన్ కేబినెట్ లో సమర్థత పేరుతో బీసీ మంత్రులను మాత్రమే మార్చారని మండిపడ్డారు. బీసీలు కులాల పేరుతో విడిపోకుండా ఐక్యంగా ఉండాలని, అదే మహాత్మా జ్యోతిబా పూలేకు నిజమైన నివాళి అవుతుందని పిలుపునిచ్చారు.

స్థానిక శాసనసభ్యులు బోండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ బీసీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని రంగాల్లో వారిని ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే వర్ల కుమార రాజా మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను కూటమి ప్రభుత్వం కార్యరూపంలోకి తీసుకువస్తోందన్నారు. ముందుగా మహాత్మా జ్యోతి బా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రులు ఘన నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమంలో 11 మంది ప్రముఖులకు సత్కారం చేశారు. వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న 11 మంది బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రతిభావంతులను మంత్రి సవిత సత్కరించారు. వారిలో దండమూడి సుమతి(మృదంగం), ఎన్.వేముల కుమారి(సామాజిక సేవ), శాంతి(సేవా రంగం), నాగిడి గాయత్రి(స్విమ్మింగ్), దాసరి తాతారావు(జానపద గాయకుడు), బొల్లెం రామారావు (కళాకారుడు), పోతబత్తుల లక్ష్మణరావు ( చేనేత, రంగ స్థల కళాకారుడు), పామర్తి శివ నాగారావు(సూక్ష్మ శిల్ప కళ), డి.రాజకుమార్ వడియార్(శిల్ప కళ), డాక్టర్ మీగడ రామలింగ స్వామి(సాహిత్యం), దళవాయి శివమ్మ(కళలు)ను మంత్రి సవిత సత్కరించి, మెమోంటో అందజేశారు. వారితో పాటు కార్పొరేషన్ చైర్మన్లను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు రెడ్డి అనంత కుమారి, నందం అబద్ధయ్య, వీరంకి వెంకట గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, మల్లె ఈశ్వర రావు, రుద్రకోట సదాశివరాం, కూడిపూడి సత్తిబాబు, ఆర్.వెంకటరమణప్ప, ఎర్రిబోతు రమణా రావు, వెంకటేశ్వర రాజు, వెంకటలక్ష్మి, కె.పార్వతమ్మ, లక్ష్మీనారాయణ, కె.పాపారావు, ఆకాశపు స్వామి, పలువురు డైరెక్టర్లు, బీసీ సంక్షేమ శాఖాధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## ఆస్తి పన్ను చెల్లింపు దారులకు, గృహ యజమానులకు గొప్ప సదవకాశం.



**జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఏప్రిల్ 11:** ఆస్తి పన్ను చెల్లింపుదారులకు, గృహ యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప సదవకాశాలను కల్పించిందని, 2026 మార్చి 31 వరకు ఉన్న ఆస్తిపన్ను బకాయిలు పై 50 శాతం వడ్డీ మాఫీ ను పొడిగిస్తూ 2026 ఏప్రిల్ 30 వ తేదీ లోగా ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించుకునే మరొక అవకాశాన్ని కల్పించిందని అన్నారు. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను 2026 ఏప్రిల్ 30 లోగా చెల్లించిన వారికి 5 శాతం రిబేటు ను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందని, ఈ సదవకాశాలను మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో గల ఆస్తిపన్ను దారులు, గృహ యజమానులు తప్పకుండా వినియోగించుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ వివరిస్తూ మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధి లోని గృహ యజమానులకు, ఆస్తిపన్ను చెల్లింపు దారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తేది 31.03.2026 లోగా ఆస్తిపన్ను బకాయిలు ఏక మొత్తము ఒకేసారి చెల్లించిన వారికి 50 శాతం వడ్డీను మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం నగర ప్రజలకు విదితమేనని అన్నారు. ఈ సదవకాశం వినియోగించు కో లేక పోయిన ఆస్తిపన్ను చెల్లింపుదారులకు మరొకసారి ఈ అవకాశం కల్పిస్తూ, సదరు గడువు తేది 30.04.2026 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం మెమో నెం. 3161714/సి2/2026 యం.ఎ.ఽయు.డి. (సి2) డిపార్టుమెంటు, తేది 01.04.2026 ద్వారా ఉత్తర్వులు జారీచేసియున్నారన్నారు. కావున, ఆస్తిపన్ను బకాయిదారులు అందరూ ఈ సదవకాశం వినియోగించు కొని జి.వి.యం.సి.కి చెల్లించవలసిన ఇంటిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు తేది 30.04.2026 లోగా చెల్లించి 50 శాతం వడ్డీ రాయితీ లబ్ధిని పొందవలసినదిగా కోరడమైనదన్నారు .

అలాగే ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కార్పొరేషన్ల చట్టం 1955, సెక్షన్ 264 (3) అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ప్రస్తుత ఆర్థిక సంవత్సరము నకు సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను 2026 ఏప్రిల్ 30 లోగా చెల్లించిన వారికి 5 శాతం రిబేటు ను రాష్ట్ర ప్రభుత్వం కల్పించినదని, కావున ఆస్తిపన్ను చెల్లింపుదారులు, గృహ యజమానులు 2026-27 ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అనగా తేది 01.04.2026 నుండి తేది 31.03.2027 వరకు గల సంవత్సర కాలమునకు చెల్లించవలసిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను 2026 ఏప్రిల్ 30 వ తేదీలోగా చెల్లించి తమ ఆస్తిపన్ను డిమాండ్ పై 5 శాతం రిబేటు ను పొందవలసినదిగా కోరడమైనదన్నారు. కావున విశాఖ నగర పరిధిలోని గృహ యజమానులు / ఆస్తిపన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం వారు కల్పించిన ఈ సదావకాశములు వినియోగించుకొని జి.వి.యం.సి.కి చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు వెంటనే చెల్లించి 50 శాతం వడ్డీ మినహాయింపును అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆస్తి , ఖాళీ స్థలాల పన్నుపై 5 శాతం రిబేటును పొంది నగర అభివృద్ధిలో భాగస్వాములు కావలసినదిగా కోరడమైనదన్నారు.

జి.వి.యం.సి. సౌకర్యం కేంద్రములలో నగదు, డి.డి. చెక్కు, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా, జి.వి.యం.సి. వెబ్ పోర్టల్ వివరములు : gvmc.gov.in ? epayment ? property tax/vacant land tax ? Assessment Number (New / old) & email id ? enter tax amount ? pay now. ద్వారా ఆస్తి పన్ను చెల్లింపు దారులు, గృహ యజమానులు ఆస్తి పన్నులను చెల్లించుకోవచ్చునని కమిషనర్ తెలిపారు.

# తాణాంలో ఘనంగా మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు.








- మహిళా విద్యాభివృద్ధి కోసం మహాత్మా పూలే చేసిన సేవలు చిరస్మరణీయం.
- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.
- వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి జ్యోతి రావు పూలె.
- ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి.

**పరవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 11:** మహాత్మా జ్యోతి రావు పూలే 200 వ జయంతి వేడుకలు సందర్భంగా శనివారం ఉదయం పరవాడ మండలం లోని తాణాం గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలె బి సి రెసిడెన్సియల్ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కె. శ్రీ దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి మహాత్మా జ్యోతి రావు పూలే 200 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి లు పాల్గొని, ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతి రావు పూలె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కార్యక్రమానన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ముఖ్య అతిదులకు ఎంపీటీసీ రొంగలి సునీత గోపాలకృష్ణ పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో సమానత్వం కోసం మహిళా విద్యాభివృద్ధి కోసం మహాత్మా పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వెనుకబడిన వర్గాలకు విద్య అనే ఆయుధాన్ని అందించి వారి అభ్యున్నతికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తిగా ఆయన నిలిచారని కొనియాడారు. నేటి తరం ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని సమాన హక్కులు, సామాజిక న్యాయం సాధనలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహాత్మా పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జ్యోతి రావు పూలె ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోని విద్య లో విశేషణంగా రానించాలని ఆకాంకిషితు, నిరర్ధక సామాజిక మధ్యమాల పట్ల విద్యార్థునులు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సామాజిక మధ్యమాలను మంచిగా ఉపయోగించు కొని తమ ఆశయ సాధను కు చేరుకోవాలని విద్యార్థునులకి పిలుపునిచ్చారు. మహిళలు బాగుపడితేనే సమాజం బాగుపడుతుందన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి మాట్లాడుతూ అణగారిన కులాల పట్ల వివక్షతను వ్యతిరేకిస్తూ పూలె ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళా సాధికారీత పట్ల ఆకుంఠిత దీక్ష తో పనిచేయాలని బి సి సంక్షేమ శాఖ అధికారులను కోరారు. ఉమ్మడి రాష్ట్రం లో మహిళలు కు విద్యా, ఉద్యోగాలలో మొట్ట మొదటిగా రిజర్వేషన్ కల్పించింది నందమూరి తారకరామారావు అన్నారు. జ్యోతి రావు పూలె అంటరాని తనం, పరిశుభ్రత, శాంతియుత వాతావరణంలో నిరసన తెలియజేసారు. మహిళ పక్ష పాతి ఎన్టీఆర్ అన్నారు. బీసీల అభ్యున్నతి కోసం, బీసీల అభ్యున్నతికి పాటు పడి అణగారిన వర్గాలకు వెనుకబాటు తనానికి చదువు తోనే వారికి న్యాయం జరుగుతుంది అన్నారు. సావిత్రి బాయి పూలే ద్వారా దేశం లోనే మొదటి ఉపాధ్యాయురాలుగా అందరినీ చైతన్య పరిచినటువంటి వారిని స్మరించుకుని వారి అడుగు జాడల్లో నడవడమే మనం ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు మేలు చేయాలన్న దాని పై పోరాడి, విప్లవ జ్యోతిగా అట్టడుగు వర్గాల వెనుకబాటు తనానికి, బడుగులు బానిసలుగా ఉండడానికి, దోపిడీ, అణిచివేత, వివక్షలను అర్థం చేసుకోవడానికి, చదువు లేకపోవడమే కారణమని, అందరికీ చదువు వుండాలని పాటు పడి అణిచివేతకు గురౌతున్న కులాల, ప్రజల పక్షాన పోరాడటమే ఆయన గొప్పతనం అన్నారు. అంతే కాకుండ ఆధిపత్య వర్గాలు వితంతువుల పునర్వివాహనికి గొప్ప కృషి చేశారని, అలాంటి మహానాయకుడు అడుగుజాడల్లో నడుస్తూ ఆయన చేసి నటువంటి త్యాగాలను భవిష్యత్ భావితరాలు గుర్తుంచు కోవాలని హితవు పలికారు. జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. మహిళల విద్యా కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతి రావు పూలె అన్నారు. ఆధునిక భారతదేశంలో సామాజిక న్యాయం, మహిళా సాధికార ఉద్యమాలకు ఆద్యుడు జ్యోతిరావు పూలే గారు అని అన్నారు. సమాజంలో కుల వ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ పురుషుల సమాన హక్కుల కోసం ఎంతగానో పోరాడిన సామాజిక యోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ని కలిసిన ఎంపీటీసీ రొంగలి సునీత గోపాలకృష్ణ ఎంజేపిఏపిబిసిడబ్ల్యూఆర్ స్కూలు పూర్వ విద్యార్థులు, స్థానికులు ఐన చీపురుపల్లి భవ్యలక్ష్మి, చీపురుపల్లి నిహారికలు కుటుంబ సభ్యులను కోల్పోయి ఆదరణ లేక ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ కి విన్నవించడం జరిగింది. దీని పట్ల సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తగిన తక్షణ సహాయం అందేలా చూడాలని, సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి కలిసేలా అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకువచ్చినందుకు సునీత గోపాలకృష్ణ ని ప్రత్యేకంగా అభినందించిన ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తి, కలెక్టర్. ఈ

కార్యక్రమంలో డి ఆర్వో వై.సత్యన్నారాయణ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కె. శ్రీదేవి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ రామ మోహిని, బి సి సంఘ నాయకులు,పెద్ద ఎత్తున విద్యార్థునులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## రామాయణం, రామాలయం మన సంస్కృతికి ప్రతీకలు.

- సీతారాముల ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు.



**కొత్తపేట, పెన్ సత్తా, ఏప్రిల్ 11:**రామాయణం, రామాలయాలు మన సంస్కృతికి ప్రతీకలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శనివారం ఆలమూరు మండలం పెనికేరు ఎస్సీ కాలనీలో నూతనంగా పునర్నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. అనంతరం స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిధిలావస్థకు చేరుకున్న రామాలయాన్ని గ్రామస్తుల సహకారంతో పునర్ నిర్మించు కోవడం అభినందనీయమన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందించిన స్థానిక తెదేపా నాయకుడు ఈదర చినబాబును అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నివాళులు




**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఏప్రిల్ 11**: తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే 200 వ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్ర పటానికి రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వర రావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ ఘన నివాళులు అర్పించారు. జ్యోతిరావు పూలే దళితుల అభ్యున్నతి, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు ఆయన జీవితాంతం కృషిచేశారు అని, నేటితనం ఆయనను ఆదర్శంగా తీసుకొని సమాజ శ్రేయస్సు కోసం నడవాలని తెలపడం జరిగింది. అనంతరం ప్రజా దర్బార్ నిర్వహించి ఫిర్యాదులను స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, యలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ, మాజీ ఎంపీపీ వడిశిల శ్రీనివాసరావు, ఎంపీటీసీ నీరుకొండ నర్సింగరావు, పుర్రె శ్రీనివాసరావు, కర్రి వెంకట రమణ, కే కే రమేష్ రాజు, కే కే బాబుజి, కుంద్రపు వెంకు నాయుడు, లాలం రాజు, యాంద్ర అప్పల నాయుడు, దేశంశెట్టి అప్పల నాయుడు, కట్టుమూరి చిట్టేశ్వరావు, లాలం రమణ, రాజాన రాము నాయుడు, పిల్లా వరలక్ష్మి, లాలం సత్తిబాబు, ధర్మిరెడ్డి నాయుడు బాబు, కొలగాని శేషు, పిన్నమరాజు శైలేష్ రాజు, రాయి శ్రీను, కోలా నాగేశ్వర రావు, పెయ్యాల గిరి, గుర్రం గోవింద, కుందిరి అప్పలరాజు, శనివాడ ఆనంద రావు, సుంకర శ్రీను, బద్ది తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

## 87 వ వార్డులో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు.

ఘన నివాళులర్పించిన రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం (జగన్).




**గాజువాక, పెన్ సత్తా, ఏప్రిల్ 11:**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే 87 వ వార్డ్ పార్టీ కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్) పాల్గొని ముందుగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల, మహిళల హక్కుల కోసం పోరాడారాని విద్యావంతులను చేయడం ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని నమ్మారని, ఆయన సిద్ధాంతాలు ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు విజయరామ రాజు, మాజీ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజన్ రాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి లక్కరాజు సోమరాజు, జాన్ రమేష్, దాలయ్య, ఆనంద్ కుమార్, దుగ్గపు రాజేంద్ర ప్రసాద్, కడుపుట్ల శ్రీను, ఆదినారాయణ, బొడ్డా సన్యాసి, ఈ. దేముడు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయ పార్టీలు పెడతారు.



- కాని వైసీపీ పార్టీ పెట్టింది వేరే సిద్ధాంతాల కోసం.
- జగన్ ను మూల కూర్చోబెట్టినా వైసీపీ వాళ్లకు బుద్ధి రాలేదు.
- అధికారం లోకి వస్తే వినాశనం చేస్తామని చెప్పడం దారుణం.
- వైసీపీ పార్టీ నినాదం రఫ్ఫా రఫ్ఫా మంత్రి అనిత.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఏప్రిల్ 11**: రాష్ట్ర ప్రజలు గత 5 ఏళ్లు వైసీపీ పార్టీ జగన్ మోహన్ రెడ్డి కి అధికారం ఇస్తే విధ్వంసం సృష్టించారు అని హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శలు చేశారు. ఆ పార్టీ గుర్తు ఫ్యాన్ కాదు, గొడ్డలి అని చెప్పేలా ఉంది. తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని జగన్ లక్షల కోట్లు సంపాదించారు. తండ్రి చనిపోయిన సమయంలో జగన్ అధికారం కోసం సంతకాలు సేకరణ చేయించారు అని అనిత ఏద్దేవా చేశారు. జగన్ అధికారం కోసం ఎన్ని అడ్డదారులు అయినా తొక్కుతారన్నారు. జగన్ జైలుకి వెళ్తే, జగన్ తరుపున షర్మిల రోడ్డు మీద తిరిగారు. తల్లిని, చెల్లిని ఎన్నికలకు వాడుకుని వదిలేసాడని, సిఎం కుర్చీ కోసం జగన్ అనేక డ్రామాలు ఆడాడు.

వివేకానంద రెడ్డి హత్యను జగన్ వాడుకున్నాడు, ఆ తర్వాత సీబీఐ వాళ్ళని విచారణకు రాకుండా చేశాడన్నారు. అప్పట్లో ప్రజలు దీనిని నమ్మారు, ఇప్పట్లో నమ్మే పరిస్థితి లేదు.

అదే కాకుండా కోడి కత్తితో కూడా డ్రామా చేశారు. జగన్ సైకాలజీ మీద అనుమానం కలిగింది. అమర్నాథ్ గౌడ్ ని సజీవ దహనం చేశారు. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్ ను హింసించారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేయించారు.

జగన్ వాహనం కింద నలిగి సింగయ్య ప్రాణం పోయింది. మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఇప్పుడు మావిగన్ అన్నారు. మావిగన్ అనేది న్యూరో మెడిసన్ అని అంటున్నారు. అందరికి భోజనం పెట్టే రైతుని ఇబ్బంది పెట్టాడు.

2024 లో ప్రజలు జగన్ కి సినిమా చూపించారు. కోర్టు కూడా మొట్టి కాయలు పెట్టినా బుద్ధి రావడం లేదు.

ఎందుకంటే అంబేద్కర్ రాజ్యాంగం ఫాలో అవుతాం, ప్రజలకు అభివృద్ధి చేసుకుంటూ వెళ్తాం, విధ్వంసానికి పాల్పడితే తొక్కు కుంటూ వెళ్తాం అని పదే పదే చెపుతున్నారు. అరుపులకు కూటమి భయపడే పరిస్థితి లేదు.

మేము లా అండ్ ఆర్డర్ ప్రకారం మేము వెళ్తాం. గొడ్డలికి సాన పట్టినంత ఈజీ కాదు జర్నలిజం అంటే, వాళ్ల తండ్రి వల్లే కాలేదు కలం గొంతు నోక్కడం.

మేము రాజకీయ కక్షతో పని చేయట్లేదు,

కాని సోషల్ మీడియాలో వస్తున్న అభ్యంతర వ్యాఖ్యలను అరికట్టేందుకు

ఓ చట్టం చేయాలని చూస్తున్నాం.

ఈ సమావేశంలో విశాఖ పార్లమెంటు అధ్యక్షులు చోడే వెంకట పట్టాభి రామ్, ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ పాల్గొన్నారు.

# సమన్వయం, సమష్టి కృషితో చందనోత్సవ వేడుక విజయవంతం.





- విశాఖలో సమీక్షలో మంత్రులు రామ నారాయణ రెడ్డి, డీబీవీ స్వామి, అనిత
- టిక్కెట్ల ఆన్లైన్ పోర్టల్ ను ప్రారంభించి తొలి టిక్కెట్ కొనుగోలు చేసిన మంత్రి

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఏప్రిల్ 11:** వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చందనోత్సవ వేడుకలను సమన్వయం, సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని, ప్రభుత్వం నిర్దేశించిన ఎస్వోపీ ప్రకారం అన్ని చర్యలు తీసుకోవాలని, అమలు చేయాలని సూచించారు. ఈ నెల 20 వ తేదీన జరగనున్న చందనోత్సవానికి సంబంధించిన ఏర్పాట్ల పై శనివారం విశాఖపట్నం కలెక్టరేట్లో మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొని అధికారులకు స్పష్ట మైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సమావేశంలో సలహాలు, సూచనలు అందజేసిన ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా, పంచకర్ల, వంశీకృష్ణ, విష్ణుకుమార్ రాజు,
జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు హరిజవహర్ లాల్, రామచంద్ర మోహన్. ముందుగా దేవాదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో చందనోత్సవం వంటి ప్రధాన ఉత్సవాల నిర్వహణకు మంత్రుల సబ్ కమిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. జిల్లా కలెక్టర్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించగా, ఈసారి దేవాదాయ శాఖ కమిషనర్‌ను కూడా ఇన్‌చార్జ్ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించామని పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. రవాణా, పోలీస్, దేవాదాయ శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులు ఎక్కడా వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీఐపీలు దర్శనానికి ఉదయం 5 గంటల వరకు సమయం కేటాయించగా, అనంతరం సామాన్య భక్తులకు ఉచిత దర్శనం, చెల్లింపు దర్శనాలు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. అంతరాలయ దర్శనం విషయంలో నిబంధనలు కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, చందనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడం అందరి బాధ్యతా అని పేర్కొన్నారు.
చందనోత్సవానికి కట్టు దిట్ట మైన ఏర్పాట్లు ఇన్చార్జి మంత్రి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ చందనోత్సవం నిర్వహణకు సంబంధించి పలుమార్లు నిర్వహించిన సమీక్షల్లోని అంశాలను అధికారులు దృష్టిలో పెట్టు కోవాలన్నారు. కట్టు దిట్ట మైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు, మెరుగుదల పై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చందనోత్సవం రోజున స్వామివారి నిజరూప దర్శనం ఉండటంతో భారీగా భక్తులు తరలివస్తారని, ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా వంటి ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. దాదాపు 2 లక్షల మందికి పైగా భక్తులు వచ్చినా సజావుగా దర్శనాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాలంటీర్లు క్యూ లైన్లలో భక్తులను నియంత్రితంగా ముందుకు పంపాలని, తొక్కిసలాటలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలన్నారు. చందనోత్సవం అనంతరం 24 గంటల్లోపు శుభ్రత పనులు పూర్తి చేయాలని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు.
సమన్వయం కీలకం, నిర్లక్ష్యానికి తావులేదు హోం మంత్రి. హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరిగే ఉత్సవం అయినప్పటికీ నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఎస్వోపీ ప్రకారం పనిచేస్తూ, గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని మెరుగైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. 20 గంటల పాటు జరిగే కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, ఎండోమెంట్స్ శాఖలు షిఫ్ట్ విధానంలో పని చేయాలని, ప్రతి ఉద్యోగి బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అకాల వర్షాలు వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని షెల్టర్లు, పండాల్స్, జర్మన్ షెడ్స్ బలంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విభాగాల మధ్య సమన్వయం లేకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని, ఇది మా శాఖ కాదు అనే భావనను వదిలి అందరూ సేవా భావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. చందనోత్సవంలో సామాన్య భక్తుల దర్శనానికే ప్రాధాన్యత ఇవ్వాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు.
అనంతరం ఆన్లైన్ టిక్కెట్ విక్రయ పోర్టల్ ప్రారంభం. భక్తుల సౌకర్యార్థం దర్శనాల టిక్కెట్ల విక్రయాల ప్రక్రియకు సంబంధించిన ఆన్లైన్ పోర్టల్ ను మంత్రులు ఆనం రామ నారాయణ రెడ్డి, ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మీటి నొక్కి ప్రారంభించారు. తొలి టిక్కెట్టును దేవాదాయ శాఖ మంత్రి కొనుగోలు చేశారు. సోమవారం నుంచి ఆన్లైన్లో టిక్కెట్లను విక్రయించనున్నట్లు దేవస్థానం ఈవో వెంకటరావు తెలిపారు. చాలా సులభ మైన పద్ధతిలో టిక్కెట్ కొనుగులు చేసుకునేలా ఏపీటీఎస్ సాయంతో ఈ పోర్టల్ ను దేవస్థానం అధికారులు రూపొందించారు. సమీక్ష సమావేశంలో భాగస్వామ్య మైన ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, విష్ణుకుమార్ రాజు పలు అంశాల పై సలహాలు, సూచనలు అందజేశారు. గందరగోళ పరిస్థితులు లేకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. ఎండోమెంట్ ఎక్స్అఫిసియో సెక్రటరీ హరిజవహర్ లాల్, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మణికంత, మేరీ ప్రశాంతి, దేవస్థానం ఈవో వెంకటరావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఛైర్పర్సన్ సీతంరాజు సుధాకర్, ఏపీ ఆయిల్స్ గ్రోవర్ & సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ పంచకర్ల సందీప్, డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, విశాఖ ఇంచార్జి ఆర్డీవో శేషశైలజ, దేవస్థానం, రెవెన్యూ, పోలీస్, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రోటరీ ఐ హాస్పిటల్ పునః ప్రారంభం..





**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 11:** ఏ ఎం ఏవీఎం రోటరీ ఐ హాస్పిటల్ ని శనివారం పునః ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి, రోటరీ పాస్ట్ గవర్నర్లు ఎం వెంకటేశ్వరరావు, కిషోర్ కుమార్, విశ్వనాథం, అనకాపల్లి వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు,) అధ్యక్షులు తమ్మన రఘుబాబు, ఏ ఎం ఏ వి హాస్పిటల్ అధ్యక్షులు సుంకర వెంకట రంగారావు, కార్యదర్శి బొడ్డేడ రామ అప్పలనాయుడు, ఐ ఆపరేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి , ముఖ్య అతిథులుగా విచ్చేసారు. ఐ హాస్పిటల్ నూతన చైర్మన్ బుద్ధ రమణాజి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. రోటరీ అధ్యక్షులు బుద్ధ శ్రీనివాసరావు తదితరుల సమక్షంలో ప్రార్థనతో ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వర్తక సంఘ కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వహణ మరలా ఆగకుండా జరగాలని కావలసిన నిధులను సమకూర్చు కోవాలని రోటరీ క్లబ్ ను కోరారు. అదే విధంగా ఫాస్ట్ గవర్నర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ నిధులు సమకూర్చు కోవాలని, మంచి కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐ హాస్పిటల్ కో చైర్మన్ కడిమి శెట్టి సతీష్, రాజేశ్వర్ ప్రసాద్, అచ్యుతరామయ్య, కే ఎల్ ఎం కుమార్ మాట్లాడారు. రోటరీ ఐ హాస్పిటల్ నందు ప్రతి శనివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఓపి ప్రారంభించడం జరుగుతుంది, ఆపరేషన్ అవసరమైన వాళ్ళని ఆదివారం
ఉదయం ఆపరేషన్ చేసి ఉచితంగా మందులు కళ్ళజోడు ఇవ్వడం జరుగుతుంది అని హాస్పిటల్ చైర్మన్ రమణాజి అన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం గర్వకారణం: జిల్లా కలెక్టర్ అంకిత్.

- సమన్వయంతోనే జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డులు.
- వైద్య శాఖకు కలెక్టర్ అభినందనలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 11** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల్లో ఒక భాగంగా జిల్లా వైద్య విధానం పరిషత్ ఆసుపత్రుల సిబ్బందికి ప్రశంస పత్రాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం పాల్వంచ పెద్దమ్మ గుడి సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై, వైద్య సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేసి, వారి సేవలను ప్రశంసించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంగా ఉన్న జిల్లాలో నాణ్యమైన వైద్య సేవలను అందించడం ఎంతో సవాలుతో కూడుకున్నదైనా, జిల్లా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని తెలిపారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ఈ జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడం ద్వారా ప్రజల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడంలో వైద్య శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు .
గతంలో మారుమూల గ్రామాలకు సరైన రహదారి, కమ్యూనికేషన్ సదుపాయాలు లేకపోవడం వల్ల వైద్య సేవలను సమర్థవంతంగా అందించడంలో అనేక సమస్యలు ఎదురయ్యాయని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడంతో చర్ల, గుండాల వంటి దూర ప్రాంతాల్లో కూడా అత్యాధునిక వైద్య సేవలను అందించడం సాధ్యమైందని తెలిపారు. టెలీమెడిసిన్, డిజిటల్ కనెక్టివిటీ, మొబైల్ వైద్య సేవల ద్వారా ప్రజలకు సమయానికి చికిత్స అందించడం సాధ్యమవుతోందని చెప్పారు.
ఈ విజయానికి ఆశా కార్యకర్తల నుండి ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, వైద్యులు, జిల్లా స్థాయి అధికారులు వరకు అందరి సమన్వయం ముఖ్య కారణమని కలెక్టర్ అన్నారు . ప్రతి ఒక్కరు తమ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడం వల్లనే జిల్లాకు రాష్ట్ర స్థాయిలో అత్యున్నత అవార్డులు లభించాయని తెలిపారు. ఇది జిల్లాకు గర్వకారణమని అన్నారు.
జిల్లా వైద్య శాఖ ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి, రాబోయే రోజుల్లో రాష్ట్ర స్థాయితో పాటు దేశ స్థాయిలో కూడా అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు, ప్రతి పల్లె, ప్రతి గిరిజన ప్రాంతానికి ఆరోగ్య సేవలు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు .



ప్రస్తుత సంవత్సరంలో సాధించిన విజయాలను కొనసాగిస్తూ, వచ్చే సంవత్సరం కూడా మరిన్ని ప్రతిష్టాత్మక అవార్డులు జిల్లాకు తీసుకురావాలని వైద్య సిబ్బందిని ప్రోత్సహించారు. సేవా భావంతో పనిచేసే వైద్య సిబ్బంది వల్లే ప్రజల నమ్మకం పెరుగుతుందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు.
ఈ కార్యక్రమంలో డిసిహెచ్ రవిబాబు, తాసిల్దార్ దారా ప్రసాద్, ఆసుపత్రుల సూపర్డెంట్లు, వైద్యులు, నర్సులు, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు



**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 11:** నూకాంబిక అమ్మవారికి భక్తులు 11-03-2026 ది నుండి 10/04/2026 వరకు మొత్తం 31 రోజులలో హుండి ద్వారా సమర్పించిన ముడుపులు, మొక్కు బడులను నూకాంబిక అమ్మవారి దేవస్థానము మండపములో లెక్కింపు జరిగినది. సదరు లెక్కింపులో నగదుగా రూ 80, 17,580/- లు, బంగారం 9 గ్రాములు 100 మిల్లీ గ్రాములు, వెండి 710 గ్రాములు వచ్చినది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఉప కమిషనర్ ఎన్ సుజాత, ఆలయ సహా కమిషనర్ యళ్ళశ్రీధర్, జిల్లా సహాయ కమిషనర్ కేఎల్ సుధారాణి, దేవదాస్ ఇన్స్పెక్టర్ వసంతరావు, ఆలయ ధర్మకర్తలు
సూరే సతీష్, దాడి రవికుమార్
పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు,కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడ్రాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, హుండీల లెక్కింపునకు దేవస్థానము సిబ్బంది, పూజారులు, శ్రీవారిసేవ సభ్యులతోను, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది, అనకాపల్లి టౌన్ పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

## ఏఎంఏఎల్ కళాశాలలో దివీస్ లేబరేటరీస్ ఇంటర్వ్యూలో 27 మంది ఎంపిక



**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 11:** వర్తక సంఘ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న స్థానిక ఏ ఎం ఏ ఎల్ కళాశాల ప్రాంగణంలో దివీస్ లేబరేటరీస్ జరిపిన ఇంటర్వ్యూలో 27 మంది ఎంఎస్సి కెమిస్ట్రీ విద్యార్థులు ఎంపిక అయ్యారని, వీరికి 2.64 లక్షల వార్షిక ఆదాయం ఇవ్వబడుతుంది అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయ బాబు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిపిన అభినందన కార్యక్రమానికి కళాశాల గవర్నింగ్ బాడీ ప్రెసిడెంట్ శ్రీధరాల కృష్ణ పేర్రాజు హాజరై విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపి, సంతోషాన్ని వ్యక్తం చేసారు. అనంతరం విద్యార్థులకు నియామక పత్రాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు, వర్ధక సంఘ ప్రముఖులు కొణతాల లక్ష్మీనారాయణ రావు, తమ్మన రఘుబాబు, కోరుకొండ వెంకట శరత్ కుమార్, దాడి శ్రీనివాసరావులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్
టి. నిరంజన్ కుమార్, సూపరింటెండెంట్ పి. అనురాధ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ హెడ్ ఏ. సూరిబాబు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## జెండా ఊపి సైకిల్ రేస్ ను ప్రారంభించిన హెచ్.ఓ.పి అయస్కాంత జేనా



**పరవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 11:** ఈ నెల 14 నాడు అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎన్టీపీసీ సింహాద్రి మేనేజ్మెంట్ ఆర్థిక సహాయంతో ఎన్టీపీసీ సింహాద్రి ఎస్సి, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించ బడుచున్నవి. అందులో భాగంగా శనివారం ఉదయం 6.30 నిమిషాలకు ఎన్టీపీసీ సింహాద్రి ఉద్యోగులకు జరిగిన సైకిల్ రేస్ ను ఎన్టీపీసీ సింహాద్రి హెచ్. ఓ. పి అయస్కాంత జేనా జెండా ఊపి సైకిల్ రేస్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్. ఓ. పి తో పాటు హెచ్. కె.వర్మ(జి.ఎం మెయింటనెన్స్), రాజ్ కుమార్(డి . సి.సి.ఐ.ఎస్.ఫ్), రాజేష్ చావ్లా, డి. కె. తోమర్, రాజేంద్ర సింగ్, ఎన్టీపీసీ సింహాద్రి ఎస్సి, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గోడి. చంద్ర శేఖర్, అజ్మీర వెంకటేశ్వర రావు, కార్యవర్గ సభ్యులు కే. తాత బాబు, టి. రాజలింగం, సిపురిపల్లి.ప్రసాద్, ఈతలపాక. అప్పల రాజు పాల్గొన్నారు. ఈ రేస్ కు న్యాయనిర్ణేతగా బాలభారతి స్కూల్ పి. ఈ. టీ.జేన్స్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి ఏప్రిల్ 14 నాడు బహుమతులు ఇవ్వబడుతుందని ఎన్టీపీసీ సింహాద్రి ఎస్సి ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం తెలియజేసింది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## కష్టాల కడలిలో కరెంటు కార్మికులు

'ఎగిరెగిరి దంచినోడికి అదే కూలి.. ఎగరకుండా దంచినోడికి అదే కూలి' అన్నట్లు ఎసిలో కూర్చునోళ్లకు అదే కూలి. ఎండనక, వాననకా, రాత్రనక, పగలనక కరెంటు కోసం చెట్లు పుట్టలు ఎక్కెటోళ్లకు అదే కూలి, కాదు అంతకన్నా తక్కువ కూలీ అదేంది అనుకుంటున్నారా ఇది నిజం. కింద కూసోని పని చెప్పేటోళ్లకు పైసలెక్కువ, అదే కరెంటు స్తంభాలెక్కి పనిచేసే కార్మికులకు తక్కువ జీతం, ఎక్కువ శ్రమ, గ్యారెంటీలేని జీవితం ఎప్పుడు ఏమవుతుందో అర్థంకాని పరిస్థితి ఇన్ని ఇబ్బందులను తట్టుకొని కూడా శ్రమిస్తున్నారంటే నిజానికి కరెంటు కార్మికులకు మనం సెల్యూట్ చేయాల్సిన అవసరం ఉంది. ఒక పది నిమిషాలు కరెంటు పోతే మనం అల్లాడిపోతం, అంతేకాదు మనం 12 గంటలు డ్యూటీ చేస్తేనే అయోమయం అయిపోతాం. మరి అలాంటిది కరెంటు కార్మికుల పరిస్థితి ఎప్పుడైనా చూశారా? మన దేశంలో ఎక్కువ కష్టపడేది ఎవరంటే మొదటగా సైనికులు, ఆ తర్వాత పోలీసులు, కరెంటు కార్మికులు కూడా అత్యధికంగా శ్రమించేవారే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఎండైనా, వానైనా, రాత్రైనా ప్రమాదకరమైన పరిస్థితుల్లో విద్యుత్ స్తంభాలెక్కి పని చేయడం చిన్న విషయం కాదు. ఒక్క చిన్న తప్పిదం జరిగినా ప్రాణానికి ముప్పు. అయినా కూడా వాళ్లు పనిచేస్తూనే ఉంటారు, ఎందుకంటే సమాజం నడవడానికి వాళ్ళు చేయడం ఎంతో అవసరం లేదంటే అంత చీకటిమయం. మరి అంత శ్రమించేవారికి జీతం ఎందుకు తక్కువ అనుకుంటున్నారా అదే మరి సమస్య ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది. 'ఒక గుడ్డివాడికి చూపు రాగానే మొట్టమొదట విసిరేసేది అప్పటివరకు సహాయపడిన చేతికర్రనే' అన్నట్లు ఓడిపోయినా నాయకులకు, గెలిచినా నాయకులకు కరెంటు కార్మికులు చేతికర్రలాంటోళ్ళు వాళ్ళకి పదవి రాగానే కరెంటు కార్మికులను కంటికి కనపడకుండా తిరుగుతారు. అప్పటిదాకా మేము ఉన్నాం మీకు అది చేస్తాం ఇది చేస్తాం అన్నోళ్లే ఆఖరికి ఏమి చేయలేని పరిస్థితి. ఈ కార్మికుల కష్టాలు ఎవరికీ చెప్పుకోవాలో అర్థంకాక కకావికలం అవుతున్నారు.

కెసిఆర్ ప్రభుత్వం పర్మినెంట్ చేస్తాం అనగానే కార్మికులకు ఇక మాకు మంచిరోజులు వచ్చినాయి అనుకుండ్రు. తీరా చూస్తే మళ్ళీ మొదటికి వచ్చింది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు శాశ్వత హోదా కల్పించమని ఏండ్లతరబడి మొత్తుకున్నా ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఇగ చేస్తాం అగ చేస్తాం అని చెప్పుడే తప్ప చేసింది ఏమీలేదు. గత 18 ఏళ్లకు పైగా తెలంగాణ విద్యుత్ రంగంలో కాంట్రాక్ట్ కార్మికులుగా సేవలందిస్తున్నవారు అప్పటి తెలంగాణ ఉద్యమ సమయంలో, వీరి సేవలను క్రమబద్ధీకరిస్తామని అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇచ్చారు. ఆ హామీ నెరవేరకపోవడంతో, 2016లో విద్యుత్ కార్మిక సంఘాలతో కలిసి నిరసన తెలిపారు. నిరసన కారణంగా జులై 28, 2017న పారిశ్రామిక వివాదాల చట్టం, 1947లోని సెక్షన్ 12(3) ప్రకారం ఒప్పందం కుదిరింది. జులై 29, 2017న సంస్థలో విలీనం చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంతవరకు చూస్తే సమస్య పరిష్కారం దిశగా వెళ్లినట్టే కనిపించింది. అయితే, 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు' కొందరు నిరుద్యోగ యువకులు దీనిని హైకోర్టులో సవాలు చేసి నీరుగార్చేలా చేశారు. సెప్టెంబర్ 18, 2018న హైకోర్టు కార్మికులకు అనుకూలంగా తీర్పునిస్తూ, సెక్షన్ 12(3) ప్రకారం ఈ సమస్యలను పరిష్కరించుకునే అధికారం విద్యుత్ సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక సంఘలకు ఉందని స్పష్టం చేసింది. అప్పటి సిఎం అసెంబ్లీలో, గవర్నర్ ప్రసంగం ద్వారా 23,667 మంది కార్మికులను క్రమబద్ధీకరించినట్లు ప్రకటించారు. కానీ కార్మికుల రెగ్యులరైజేషన్ అనే ప్రక్రియ అనేక మలుపులు తిరుగుతూ కార్మికులకు పూర్తిస్థాయి క్రమబద్ధీకరణకు బదులుగా, పాత ఉత్తర్వులను రద్దు చేసి, ఫ్యాక్టరీల చట్టం 1946 స్టాండింగ్ ఆర్డర్స్ సర్వీస్ రూల్స్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల అధికారికంగా శాశ్వత హోదా లేకుండానే కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారు. 'చెప్పుకొని మురువుచూసుకొని ఏడువు' అన్నట్లు వీరు సమాజం దృష్టిలో శాశ్వత ఉద్యోగులే కానీ, ప్రభుత్వ దృష్టిలో మాత్రం కాదు. కానీ మేమేమీ అదనంగా అడగడం లేదు సార్.. ఇప్పుడు తీసుకుంటున్న జీతాలకే (కరెంట్ పే స్కేల్‌కి) మమ్మల్ని రెగ్యులర్ పోస్టుల్లోకి తీసుకోండి అనేదే మా విజ్ఞప్తి. ప్రభుత్వంపై భారం లేకుండా, మా బతుకుల్ని గాడిలో పెట్టాలనే మా కోరిక మాత్రమే.. అంతే అని అంతలా వేడుకున్నా కూడా ప్రభుత్వం కరుణించకపోవడం.. ఇది మాత్రం కరెంట్ కార్మికుల దౌర్భాగ్యమే అనాలి. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే.. విధి నిర్వహణలోనే ఎంతోమంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. మా ఆర్టిసన్ కార్మికుల్లో ఃఎవఞష్ర, డిప్లొమా, పిజిలు చేసినవాళ్లు కూడా ఉన్నారు. అయినా సరే వారికి సరైన కేడర్ లేకుండా, గౌరవం లేకుండా పని చేస్తున్నారు. వారిని కూడా గౌరవించి, సమాలోచన చేసి, తగిన చర్యలు తీసుకోవాలని, కనీసం మాకు ప్రభుత్వం పాత సర్వీస్ రూల్స్ అమలు చేసి, మా జీవితాల్లో వెలుగులు నింపండని ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# స్క్రీన్ లైఫ్ వర్సెస్ ఫిట్నెస్



మెడ, భుజాల నొప్పులకు వ్యాయామాలే పరిష్కారం!ఇప్పటి డిజిటల్ ప్రపంచంలో మెడ, భుజాల నొప్పి ఒక సాధారణ సమస్యగా మారింది. పని కోసం గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చోవడం, ఫోన్ వినియోగం, ట్రాఫిక్‌లో ఒత్తిడితో ప్రయాణాలు వంటి కారణాలతో లక్షలాది మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. తప్పు భంగిమ, ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కండరాల ఒత్తిడి, రోజువారీ జీవిత ఒత్తిడి వంటి అంశాలు ఈ నొప్పులకు దారితీస్తున్నాయి. ఈ సమస్యలు నిద్రను దెబ్బతీయడమే కాకుండా కదలికలను తగ్గించి తలనొప్పులకు కూడా కారణమవుతాయి. అయితే కొన్ని సులభమైన వ్యాయామాలతో ఈ సమస్యలను తగ్గించుకోవచ్చు. ఈ వ్యాయామాలను కొద్ది నిమిషాల పాటు చేయడం ద్వారా గట్టిపడిన కండరాలను చాచడం, బలపరచడం, శరీర సమతుల్యతను పునరుద్ధరించడం సాధ్యమవుతుంది. ఇవి నొప్పి తగ్గించడమే కాకుండా భవిష్యత్తులో సమస్యలను నివారించడంలో కూడా సహాయపడతాయి. మెడ, భుజాల నొప్పిని తగ్గించే కొన్ని సులభమైన వ్యాయామాలు ఇలా ఉన్నాయి.

### మెడ టిల్ట్స్

మెడ టిల్ట్స్ వ్యాయామం స్క్రీన్ ముందు ఎక్కువసేపు ఉండడం వల్ల గట్టిపడే మెడ పక్క కండరాలపై ప్రభావం చూపుతుంది. నిటారుగా కూర్చుని లేదా నిలబడి, భుజాలను రిలాక్స్‌గా ఉంచాలి. నెమ్మదిగా తలను ఒక వైపుకు వంచి, చెవిని అదే వైపు భుజానికి దగ్గర చేయాలి. 15 నుంచి 30 సెకన్ల పాటు ఆ స్థితిలో ఉండి సమంగా శ్వాస తీసుకోవాలి. తరువాత మరో వైపుకు కూడా ఇదే విధంగా చేయాలి. ప్రతి వైపుకు 3 సార్లు చేయడం మంచిది. ఇది రోజులో పలుమార్లు, ముఖ్యంగా ఉదయం లేవగానే లేదా నిద్రకు ముందు చేయడం వల్ల ఒత్తిడి తగ్గి రక్త ప్రసరణ మెరుగవుతుంది.

### షోల్డర్ రోల్స్

ల్యాప్‌టాప్ ముందు వంగి కూర్చోవడం వల్ల పైభాగం వెన్ను, భుజాల కండరాలు గట్టిపడతాయి. షోల్డర్ రోల్స్ ఈ సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి. నిలబడి లేదా సౌకర్యంగా కూర్చుని, శ్వాస తీసుకుంటూ భుజాలను చెవుల వైపు పైకెత్తి తరువాత ముందుకు గుండ్రంగా తిప్పాలి. 10–15 సెకన్ల పాటు ఇలా చేసి, తరువాత వెనుకవైపు తిప్పాలి. ప్రతి దిశలో 5–10 సార్లు చేయాలి. దీన్ని రోజుకు రెండు సార్లు చేయడం ద్వారా రక్తప్రసరణ పెరిగి భంగిమ మెరుగుపడుతుంది.

### చిన్ టక్స్

ఫోన్ వినియోగం వల్ల వచ్చే ఫార్వర్డ్ హెడ్ పొజిషన్‌ను సరిచేయడంలో చిన్ టక్స్ ఉపయోగపడతాయి. నిటారుగా కూర్చుని తలను కదపకుండా గడ్డాన్ని వెనక్కి తీసుకురావాలి. 5 సెకన్ల పాటు ఆ స్థితిలో ఉంచి వదలాలి. రోజుకు 2–3 సార్లు ప్రతి సారి 10 రిపిటేషన్లు చేయాలి. ఇది మెడ కండరాలను బలపరచి నొప్పిని తగ్గిస్తుంది.

### అక్రాస్ ది చెస్ట్ స్ట్రెచ్

భుజాలు వంగిపోవడం వల్ల గట్టిపడే కండరాలను సడలించడంలో ఈ వ్యాయామం సహాయపడుతుంది. ఒక చేతిని భుజాల ఎత్తులో సూటిగా ముందుకు చాపి, మరో చేతితో దాన్ని ఛాతీ వైపు నెమ్మదిగా లాగాలి. 20–30 సెకన్ల పాటు ఉంచి, ప్రతి వైపుకు 3–5 సార్లు చేయాలి. ఇది భుజాల కండరాలను రిలాక్స్ చేస్తుంది.

### ఈర్ టు షోల్డర్ స్ట్రెచ్

ఈ వ్యాయామం మెడ కండరాలను సడలిస్తుంది. తలను నెమ్మదిగా ఒక వైపు వంచి, అవసరమైతే చేతితో స్వల్ప ఒత్తిడి ఇవ్వాలి. 20–40 సెకన్ల పాటు ఉంచి, ప్రతి వైపుకు 3 సార్లు చేయాలి. ఇది ఒత్తిడి వల్ల వచ్చే తలనొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది.

### సీటెడ్ ట్విస్ట్

ఈ వ్యాయామం వెన్నెముకను సడలించి మెడ, భుజాలపై ఒత్తిడిని తగ్గిస్తుంది. కుర్చీలో కూర్చుని, ఒక చేతిని ఎదురుగా ఉన్న మోకాలిపై ఉంచి, మరో చేతిని వెనుక ఉంచి శరీరాన్ని మెల్లగా తిప్పాలి. ప్రతి వైపుకు 20–30 సెకన్ల పాటు 3 సార్లు చేయాలి. ఇది ఎక్కువసేపు కూర్చునే వారికి ఎంతో ఉపయోగకరం.

### చైల్డ్ పోజ్

ఈ యోగా భంగిమ మొత్తం శరీరాన్ని రిలాక్స్ చేస్తుంది. మోకాళ్లపై కూర్చుని, ముందుకు వంగి చేతులను ముందుకు చాపి నుదుటిని నేలపై ఉంచాలి. 30–60 సెకన్ల పాటు లోతుగా శ్వాస తీసుకోవాలి. రోజుకు 3–5 సార్లు చేయడం ద్వారా శరీర ఒత్తిడి తగ్గుతుంది.

ఈ సరళమైన వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం ద్వారా మెడ, భుజాల నొప్పులను సమర్థవంతంగా నియంత్రించవచ్చు. సరిగ్గా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుంది.

# మజ్జిగ తాగితే మంచిదా!





పెరుగు, మజ్జిగ... దాదాపు ఒకే రకమైన పోషకాలను కలిగి ఉంటాయి. అయినప్పటికీ, ఈ రెండింటిలో ఏది మంచిది అనే సందేహం చాలా మందికి కలుగుతుంది. కేవలం పెరుగుకు నీళ్ళు కలపడం ద్వారా దానిని మజ్జిగగా మార్చవచ్చు. కానీ అలా చేయడం వల్ల పెరుగు గుణాలు కూడా మారుతాయా? సమాధానం అవును. వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచడానికి పెరుగు, మజ్జిగ రెండూ మంచివే అయినప్పటికీ, వేసవి తాపాన్ని తట్టుకోవడానికి ఏది ఉత్తమమో చూద్దాం. ఎండలు మండిపోతున్న వేళ మన ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం చాలా అవసరం. వేసవిలో చల్లదనం కోసం అందరూ పెరుగు లేదా మజ్జిగను ఆశ్రయిస్తారు. అయితే ఈ రెండింటిలో ఏది ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో తప్పక తెలుసుకోవాలి. పెరుగు , మజ్జిగ రెండూ పాల ఆధారిత ఉత్పత్తులే. ఒకే కూర్పును కలిగి ఉంటాయి. దాదాపు ఒకే రకమైన పోషకాలను కలిగి ఉంటాయి. అయినప్పటికీ, ఈ రెండింటిలో ఏది మంచిది అనే సందేహం చాలా మందికి కలుగుతుంది. కేవలం పెరుగుకు నీళ్ళు కలపడం ద్వారా దానిని మజ్జిగగా మార్చవచ్చు. కానీ అలా చేయడం వల్ల పెరుగు గుణాలు కూడా మారుతాయా? సమాధానం అవును. 1. హైడ్రేషన్: మజ్జిగలో దాదాపు 90 శాతం నీరు ఉంటుంది. ఎండల వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గినప్పుడు మజ్జిగ తాగడం వల్ల తక్షణమే శక్తి వస్తుంది. పెరుగు చిక్కగా ఉండటం వల్ల అది శరీరానికి నీటిని అందించడంలో మజ్జిగ అంత ప్రభావవంతంగా ఉండదు. 2. జీర్ణక్రియ : పెరుగు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇది కొన్నిసార్లు వేసవిలో కడుపులో భారాన్ని కలిగిస్తుంది. మజ్జిగ తేలికగా జీర్ణం కావడమే కాకుండా, మనం తిన్న ఆహారం త్వరగా అరగడానికి సహాయపడుతుంది. మజ్జిగలో కొద్దిగా జీలకర్ర పొడి, అల్లం కలిపితే జీర్ణశక్తి రెట్టింపు అవుతుంది. 3. శరీర ఉష్ణోగ్రత: ఆయుర్వేదం ప్రకారం, పెరుగు స్వభావరీత్యా కొంత వేడిని కలిగిస్తుంది. కానీ దానిని చిలికి మజ్జిగలా మార్చినప్పుడు అది శీతలీకరణ ప్రభావాన్ని ఇస్తుంది. అందుకే వేసవిలో పెరుగు కంటే మజ్జిగ తాగడం వల్ల శరీరం చల్లబడుతుంది. 4. బరువు నియంత్రణ: పెరుగులో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారు లేదా క్యాలరీలను తగ్గించుకోవాలనుకునే వారు మజ్జిగను ఎంచుకోవడం ఉత్తమం. ఇందులో ప్రోటీన్లు ఉన్నప్పటికీ క్యాలరీలు చాలా తక్కువ. 5. పోషక విలువలు: ఎముకల బలానికి, దంతాల ఆరోగ్యానికి అవసరమైన క్యాల్షియం పెరుగులో పుష్కలంగా ఉంటుంది. మీకు క్యాల్షియం లోపం ఉంటే పెరుగు మంచిది. కానీ ఎండల నుండి ఉపశమనం కావాలంటే మాత్రం మజ్జిగనే మేలు. మొత్తానికి వేసవిలో మజ్జిగ సంపూర్ణ పానీయం. అయితే మీరు పెరుగు తినాలనుకుంటే మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం మంచిది, రాత్రిపూట పెరుగు తినడం వల్ల శ్లేష్మం పెరిగే అవకాశం ఉంది. ప్రతిరోజూ కనీసం రెండు గ్లాసుల పలచని మజ్జిగ తాగడం వల్ల మీ ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.

# ఆపిల్ తిన్న వెంటనే నీళ్లు తాగుతున్నారా..?



ఆపిల్ ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కానీ ఆపిల్ తిన్న వెంటనే నీళ్లు తాగితే మీ కొంప మునిగే అవకాశం ఉంది.. వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ అద్భుత ఫలం గురించి వైద్య నిపుణులు ఏమంటున్నారు. ఈ పండులో ఉన్న పోషకాలు ఏంటి? అసలు ఆపిల్ తిన్న తర్వాత నీళ్లు ఎందుకు తాగకూడదు? రోజుకో ఆపిల్ తింటే డాక్టర్ అవసరం ఉండదు అన్నది నానుడి. ఆపిల్ కేవలం ఒక పండు మాత్రమే కాదు.. అది ఒక అద్భుత ఔషధం. మన ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, విజ్ఞాన శాస్త్రంలో గురుత్వాకర్షణ శక్తిని కనిపెట్టడానికి కూడా ఇదే కారణమైంది. చాలా మంది ఆపిల్ తిన్న వెంటనే దాహంగా ఉందని నీళ్లు తాగుతుంటారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇది అత్యంత ప్రమాదకరమైన అలవాటు. ఆపిల్ తిన్న వెంటనే నీళు తాగడం వల్ల కడుపులోని జీర్ణరసాలు పలచబడతాయి. దీనివల్ల ఆహారం సరిగ్గా అరగకపోవడంతో పాటు కడుపు ఉబ్బరం, గ్యాస్, జీర్ణ రుగ్మతలు, గుండెల్లో మంట వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆపిల్ తిన్న తర్వాత కనీసం 30 నుండి 60 నిమిషాల వరకు నీళ్లు తాగకపోవడమే ఉత్తమం. ఒకవేళ తప్పనిసరి అయితే కేవలం ఒక గుక్కెడు నీరు మాత్రమే తీసుకోవాలి. ఆపిల్ పండు ఇప్పుడే పుట్టింది కాదు.. దీనికి వేల ఏళ్ల చరిత్ర ఉంది. వృక్షశాస్త్రవేత్తల ప్రకారం.. ఆపిల్ మొట్టమొదట మధ్య ఆసియాలోని కజకిస్తాన్‌లో క్రీ.పూ. 10,000 ప్రాంతంలో కనిపించింది. ప్రాచీన భారతీయ వైద్య గ్రంథం చరక సంహితలో కూడా ఆపిల్ ప్రస్తావన ఉంది. మన పూర్వీకులు దీనిని శరీరాన్ని చల్లబరిచే పండుగా గుర్తించారు. సర్ ఐజాక్ న్యూటన్ తలపై ఆపిల్ పడటంతోనే ఆయన గురుత్వాకర్షణ నియమాన్ని కనుగొన్నారన్న సంగతి మనందరికీ తెలిసిందే. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 7,500 రకాల ఆపిల్స్ అందుబాటులో ఉన్నాయి. ఒక సాధారణ పరిమాణంలో ఉండే ఆపిల్ మన శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలను అందిస్తుంది. ఇందులో 52 కేలరీలు, 13.8 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. 2.4 గ్రాములు ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. విటమిన్ సి, పొటాషియం, మాంగనీస్, రాగి పుష్కలంగా ఉంటాయి. ఇందులోని ట్రిప్టోఫాన్ నిద్రలేమి, ఒళ్లు నొప్పులను తగ్గించి మానసిక ప్రశాంతతను ఇస్తుంది.

# చెన్నై ఎట్టకేలకు..

## ఐపీఎల్-19లో తొలి విజయం
## శాంసన్ అజేయ శతకం
## దిల్లీ పరాజయం

ఐపీఎల్-19 మొదటి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన చెన్నై సూపర్‌కింగ్స్ పుంజుకుంది. శనివారం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో 23 పరుగుల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి, సీజన్లో బోణీ కొట్టింది. సంజు శాంసన్ (115 నాటౌట్; 56 బంతుల్లో 15ఐ4, 4ఐ6) వీరవిహారం చేయడంతో మొదట చెన్నై 2 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. ఆయుష్ మాత్రే (59 రిటైర్డ్ ఔట్?; 36 బంతుల్లో 3ఐ4, 4ఐ6) రాణించాడు. ఛేదనలో దిల్లీ 20 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. స్టబ్స్ (60; 38 బంతుల్లో 4ఐ4, 3ఐ6), నిశాంక (41; 24 బంతుల్లో 5ఐ4, 2ఐ6) మాత్రమే రాణించారు. ఓవర్టన్ (4/18), కాంబోజ్ (3/35) దిల్లీని దెబ్బతీశారు. ఛేదనను బలంగానే ఆరంభించిన దిల్లీ.. ఆ తర్వాత తడబడింది. ఓపెనర్లు నిశాంక, రాహుల్ (18) బ్యాట్లు ఝుళిపించడంతో 4.5 ఓవర్లలో 61/0తో నిలిచిన ఆ జట్టు.. 5 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. 76 వద్ద సమీర్ రిజ్వి (6) వికెట్‌ను కూడా కోల్పోయింది. ఓ వైపు స్టబ్స్ నిలిచినా.. చెన్నై మరో వైపు నుంచి వికెట్లు తీస్తూ, దిల్లీపై ఒత్తిడి కొనసాగించింది. పోరాటపటిమను ప్రదర్శించిన స్టబ్స్.. సీఎస్కేకు అంత తేలికగా విజయం దక్కనివ్వలేదు. చివరి రెండు ఓవర్లలో దిల్లీకి 32 పరుగులు అవసరమయ్యాయి. 19వ ఓవర్లో స్టబ్స్‌ను ఓవర్టన్ ఔట్ చేయడంతో చెన్నై ఊపిరిపీల్చుకుంది.

**సంజు దంచేశాడు..:**

6, 7, 9.. ఈ సీజన్‌లో చెన్నైకి మారిన సంజు శాంసన్, తొలి మూడు మ్యాచ్‌ల్లో చేసిన పరుగులివి. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ సీఎస్కే పరాజయం పాలైంది. ప్రపంచకప్‌లో అదరగొట్టి, ఎన్నో అంచనాలతో టోర్నీలో బరిలోకి దిగిన శాంసన్.. ఈ వైఫల్యాలతో మళ్లీ విమర్శలు ఎదుర్కొన్నాడు. కానీ శనివారం చెలరేగిపోయాడు. తన సత్తాపై సందేహాలకు



సమాధానంగా శతక్కొట్టేశాడు. చెన్నై మెరుగైన స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ జట్టు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్ శాంసన్ బ్యాట్ ఝుళిపించాడు. చక్కటి కంటి, చేతి సమన్వయంతో సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. ముచ్చటైన షాట్లతో బౌండరీలు బాదేశాడు. మరో ఓపెనర్ రుతురాజ్ (15) లయను అందుకోలేకపోయినా... శాంసన్ ఎడాపెడా ఫోర్లు కొట్టేయడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ముకేశ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4 బాదేసి అతడు.. అక్షర్ బౌలింగ్‌లో మూడు ఫోర్లు కొట్టేశాడు. ఏడో ఓవర్లో జట్టు స్కోరు 62 వద్ద రుతురాజ్ ఔటైనా.. దూకుడు కొనసాగించిన శాంసన్.. 26 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. నటరాజన్ బౌలింగ్‌లో అతడు కళ్లు చెదిరే సిక్స్ కొట్టాడు. మరోవైపు యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే కూడా చెలరేగిపోయాడు. మరోవైపు శాంసన్ కూడా తగ్గలేదు. అతడు తనవైన షాట్లతో జోరు కొనసాగించడంతో చెన్నై 17 ఓవర్లలో 173/1తో బలమైన స్థితిలో నిలిచింది. భారీ షాట్లు ఆడే దూబెకు అవకాశం ఇవ్వడం కోసం తర్వాతి ఓవర్లో మాత్రే రిటైర్డ్ ఔటయ్యాడు. శాంసన్‌తో పాటు దూబె (20 నాటౌట్; 10 బంతుల్లో 2ఐ4, 1ఐ6) ధనాధన్ షాట్లు ఆడడంతో ఆఖరి 14 బంతుల్లో చెన్నై 36 పరుగులు రాబట్టింది. నటరాజన్ బౌలింగ్‌లో ఫోర్‌తో శాంసన్ సెంచరీ పూర్తి చేశాడు. ఐపీఎల్‌లో అతడికిది నాలుగో శతకం. ఈ ఐపీఎల్‌లో నమోదైన తొలి శతకం ఇదే.

# సరిపోలేదు

## అలవోకగా ఛేదించేసిన పంజాబ్
## మెరిసిన శ్రేయస్, ఆర్య, ప్రభ్‌సిమ్రన్
## అభిషేక్ మెరుపులు వృథా
## సన్‌రైజర్స్‌కు మరో ఓటమి



చండీగఢ్‌లో బ్యాటింగ్ పిచ్.. ఫామ్‌లో లేని అభిషేక్ శర్మ ఈ సీజన్లో తొలిసారి చెలరేగిపోయాడు. అతనిచ్చిన ఆరంభాన్ని ఉపయోగించుకోలేకపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. అనుకున్న దాని కంటే తక్కువ స్కోరే సాధించింది. అయినా లక్ష్యం చిన్నదేమీ కాదు. కానీ యథావిధిగా బౌలర్లు తేలిపోవడంతో ఆ జట్టుకు మరో ఓటమి తప్పలేదు. చెలరేగి ఆడిన ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ ఛేదనలో పంజాబ్‌కు గట్టి పునాది వేస్తే.. ఆపై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సత్తా చాటి జట్టుకు విజయాన్ని అందించాడు. 4 మ్యాచ్‌లు ఆడిన పంజాబ్‌కు ఇది మూడో విజయం. ఒక మ్యాచ్ వర్షంతో రద్దయింది. 4 మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్‌కు ఇది మూడో ఓటమి.

**చండీగఢ్**

ఐపీఎల్-19లో పంజాబ్ కింగ్స్ జోరు కొనసాగిస్తోంది. ఆ జట్టు శనివారం 6 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తు చేసింది. మొదట సన్‌రైజర్స్ 6 వికెట్లకు 219 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (74; 28 బంతుల్లో 5ఐ4, 8ఐ6) విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. ట్రావిస్ హెడ్ (38; 23 బంతుల్లో 5ఐ4, 1ఐ6) కూడా రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శ్రేయస్ అయ్యర్ (69 నాటౌట్; 33 బంతుల్లో 5ఐ4, 5ఐ6), ప్రియాంశ్ ఆర్య (57; 20 బంతుల్లో 5ఐ4, 5ఐ6), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (51; 25 బంతుల్లో 4ఐ4, 4ఐ6) మెరుపులతో పంజాబ్ 18.5 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. హైదరాబాద్ బౌలర్లలో శివాంగ్ కుమార్ (3/33) ఒక్కడే రాణించాడు.



స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది

# స్టన్నింగ్ డార్క్ లుక్‌లో శ్రుతి హాసన్ గ్లామర్ షో


టాలీవుడ్ బ్యూటీ శ్రుతి హాసన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఒకపక్క తన మధురమైన గొంతుతో మ్యూజిక్ లవర్స్‌ను మైమరపిస్తూనే, మరోపక్క అదిరిపోయే ఫోటోషూట్లతో కుర్రకారు గుండెల్లో సెగలు రేపుతోంది. రీసెంట్‌గా ఆమె షేర్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఆ డార్క్ అండ్ బోల్డ్ లుక్‌లో శ్రుతి స్టైల్ చూస్తే ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అసలు శ్రుతి కొత్త ప్రాజెక్ట్స్ గురించి, ఆ ఫోటోల స్పెషాలిటీ ఏంటో ఇప్పుడు చూద్దాం.

**'పవళమల్లి'తో మాయ చేస్తున్న శ్రుతి.. మ్యూజిక్ మ్యాజిక్:**

శ్రుతి హాసన్‌కు నటనతో పాటు సంగీతం అంటే ఎంత ప్రాణమో మనకు తెలిసిందే. రీసెంట్‌గా ఆమె మహేష్ వారణాసి మూవీలో 'సంచారి' అనే పాటతో మెప్పించగా, ఇప్పుడు 'పవళ మల్లి' అనే మరో బ్యూటిఫుల్ సాంగ్‌తో మన ముందుకు వచ్చింది. యంగ్ కంపోజర్ సాయి అభ్యంకర్ సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ పాటలో శ్రుతి తన గంభీరమైన గొంతుతో ప్రాణం పోసింది. ఈ పాట వింటుంటే తెలియని హాయి కలుగుతోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కేవలం నటిగానే కాకుండా, ఒక సింగర్‌గా కూడా తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌ను క్రియేట్ చేసుకుంటోంది శ్రుతి.

**బ్లాక్ డ్రెస్.. రెడ్ బ్యాక్‌గ్రౌండ్.. అదిరిపోయిన ఫోటోషూట్:**

పాటలతో పాటు శ్రుతి లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. స్టైలిష్ బ్లాక్ క్రాప్ టాప్, లాంగ్ స్కర్ట్‌తో పాటు ఎంబ్రాయిడరీ చేసిన జాకెట్‌ను ధరించి ఆమె ఇచ్చిన పోజులు అదిరిపోయాయి. డార్క్ కలర్ థీమ్‌లో



ఉన్న ఈ ఫోటోలకు రెడ్ బ్యాక్‌గ్రౌండ్ తోడవ్వడంతో అవి మరింత అందంగా కనిపిస్తున్నాయి. మినిమల్ యాక్సెసరీస్, సింపుల్ హెయిర్ స్టైల్‌తో శ్రుతి తన బాడీ లాంగ్వేజ్‌తోనే ఒక పవర్‌ఫుల్ వైబ్‌ను క్రియేట్ చేసింది. ముఖ్యంగా ఆమె కళ్లల్లో ఇంటెన్సిటీ ఫోటోలకు హైలైట్‌గా నిలిచింది.

**లైన్ లో క్రేజీ ప్రాజెక్టులు.. సలార్ 2 కోసం వెయిటింగ్:**

శ్రుతి కెరీర్ ప్రస్తుతం మూడు సినిమాలు, ఆరు పాటలు అన్నట్లుగా సాగుతోంది. తెలుగులో 'ఆకాశంలో ఒక తార', తమిళంలో 'ట్రైన్' వంటి వెరైటీ సినిమాల్లో ఆమె నటిస్తోంది. అయితే అందరి కళ్లు మాత్రం ప్రభాస్ సరసన ఆమె నటించబోతున్న 'సలార్ పార్ట్ 2' మీదనే ఉన్నాయి. ఇక ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇలా అటు సినిమాలతో, ఇటు ఫ్యాషన్ ఇంకా మ్యూజిక్ తో శ్రుతి హాసన్ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూ తన క్రేజ్‌ను డబుల్ చేసుకుంటోంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com